VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
మంగళవారం 19.05.2026
సంపుటి: 07 సంచిక: 344
పేజీలు: 12 వెల: రూ. 5/
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
Velthuru Newspaper




## తెలంగాణకు వర్ష సూచన

- పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ
- ఉరుములు, ఈదురు గాలులకు అప్రమత్తం
- ద్రోణి, ఉపరితల చక్రవాత ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణ మార్పులు
- ఇవాళ, రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు

# భారత్-నార్వే సంబంధాలు బలోపేతం

- గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ పై ప్రకటన చేసిన ప్రధాని మోదీ
- పలు కీలక రంగాల్లో సహకార విస్తరణ
- భారత్-నార్వే మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌కు శ్రీకారం
- స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగాల్లో కలిసి పనిచేయనున్న ఇరు దేశాలు
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్‌కు మద్దతిచ్చిన నార్వేకు మోదీ కృతజ్ఞతలు
- రాజకీయ, ఆర్థిక అస్థిరతల సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం కీలకమన్న ప్రధాని
- ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య కీలక ఒప్పందం
- ఆర్కిటిక్ పరిశోధనలు, ఏఐ, సెమీకండక్టర్లలో సంయుక్త సహకారం

ఢిల్లీ వెలుతురు మే 18:

భారత్‌నార్వే ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య 'గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా స్వచ్ఛ ఇంధనం, సముద్ర ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ సాంకేతికత, అంతరిక్ష పరిశోధనలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. నార్వే పర్యటనలో భాగంగా జరిగిన సమావేశాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ.. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల మధ్య భారత్‌యూరప్ దేశాల భాగస్వామ్యం మరింత ప్రాధాన్యం ..మిగతా 2లో






## వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు
- కరీంనగర్ కలెక్టరేట్‌లో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష
- జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- ఇప్పటికే వంద శాతం వడ్లు కేంద్రాలకు రాక
- సేకరించిన ధాన్యానికి 63 శాతం మేర నిధులు
- రూ.237.39 కోట్ల నిధులు బ్యాంకుల ద్వారా రైతుల ఖాతాల్లో జమ

హైదరాబాద్ వెలుతురు మే 08:

భాగ్యనగర గుండెకాయ లాంటి మూసీ నదికి పునర్వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టు నాటికి ప్రారంభించి, వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి మొదటి దశను పూర్తి చేయాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. శనివారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమావేశమై ప్రాజెక్టు పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల ఆస్తులకు, నివాసాలకు ఇబ్బంది కలగకుండా, అత్యంత పారదర్శకంగా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని మంత్రులు దిశానిర్దేశం చేశారు. ..మిగతా 2లో



## రోడ్లపై నమాజ్‌లు వద్దు

- ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్
- రోడ్లు ఉన్నది ప్రజారవాణా కోసం ప్రార్థనల కోసం కాదు
- 'ప్రజా రవాణాకు అంతరాయం కలిగిస్తే ఊరుకోం'..
- ముస్లింలు జనాభా నియంత్రించుకోవాల్సి ఉంది
- లఖ్‌నవూలో కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు

ఉత్తర్‌ప్రదేశ్ వెలుతురు మే 18:

ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మరోసారి తన వ్యాఖ్యలతో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశారు. రోడ్లపై మాజ్‌లు నిర్వహించడం, ప్రజా రవాణాకు అంతరాయం కలిగించడం వంటి అంశాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని స్పష్టం చేస్తూ, ముస్లిం సమాజం సంయమనం పాటించాలని సూచించారు. లఖ్‌నవూలో సోమవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న యోగి ఆదిత్యనాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో రోడ్లపై నమాజ్‌లు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ..మిగతా 2లో




# తెలంగాణలో క్రీడా వారోత్సవాలు ప్రారంభం

- ఎల్బీ స్టేడియంలో '5కే వాకథాన్'ను ప్రారంభించిన మంత్రులు
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా సంబరాలకు అంకురార్పణ
- ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో మంత్రులు, ప్రముఖుల సమక్షంలో ఘనంగా శ్రీకారం
- క్రీడాకారులు, యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపిన మెగా జుంబా నృత్య ప్రదర్శనలు
- క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా శాఖ మంత్రి పొన్నం ఆధ్వర్యంలో కార్యక్రమాల పర్యవేక్షణ
- ఎల్బీ స్టేడియం నుండి అసెంబ్లీ మీదుగా ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన భారీ '5 కే వాకథాన్'
- రెండు వేల మందికి పైగా యువ అథ్లెట్లు, క్రీడా ప్రేమికుల భాగస్వామ్యంతో కదంతొక్కిన హైదరాబాద్
- ఎల్బీ ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా యోగా, ధ్యాన శిబిరాలు

హైదరాబాద్ వెలుతురు మే 18:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగానే యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి, రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం తలపెట్టిన "యువజన మరియు క్రీడా వారోత్సవాలు" సోమవారం ఉదయం హైదరాబాద్ నగరంలోని చారిత్రాత్మక లాల్ బహదూర్ (ఎల్బీ) స్టేడియంలో అత్యంత ఘనంగా మరియు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నగరంలోని ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ వేదికగా ఉదయం 6 గంటలకే ప్రారంభమైన ఈ క్రీడా సంబరాలకు రాష్ట్ర గౌరవ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు మరియు క్రీడా ప్రముఖులు పాల్గొన్నారు. వారోత్సవాల ప్రారంభ సూచికగా స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'మెగా జుంబాస ఫిట్‌నెస్ కార్యక్రమం అక్కడికి చేరిన వేలాది మందిని విశేషంగా ఆకట్టుకుంది. వేగవంతమైన సంగీత వాయిద్యాల నడుమ సాగిన ఈ జుంబా నృత్య ప్రదర్శనలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ స్వయంగా పాల్గొని యువ క్రీడాకారులతో కలిసి అడుగులు వేస్తూ వారిలో సరికొత్త జోష్ నింపడం విశేషం. ..మిగతా 2లో




## ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

- ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం
- హైదరాబాద్‌లో భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి ల ఖాతాల్లో జమ

హైదరాబాద్ వెలుతురు మే 18:

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన

## యూఏపీఏ చట్టంపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

- ఉగ్రవాద నిరోధక చట్టంపై కీలక నిర్ణయం
- నిరవధిక నిర్బంధం రాజ్యాంగ విరుద్ధం
- వ్యక్తిగత స్వేచ్ఛకు సర్వోన్నత ప్రాధాన్యం
- జమ్మూకశ్మీర్ నార్కో-టెరర్ కేసు నిందితుడికి బెయిల్
- నేరం రుజువయ్యే వరకు నిందితుడు నిర్దోషే
- న్యాయ సూత్రాన్ని పునరుద్ఘాటించిన ధర్మాసనం
- 2021 నాటి 'కేఏ నజీబ్' తీర్పు అన్ని కోర్టులకు బైండింగ్
- జాతీయ దర్యాప్తు సంస్థ 2020 నాటి కేసు పూర్వాపరాలు
- ఢిల్లీ అల్లర్ల కేసు ప్రస్తావన: గత తీర్పులపై సుప్రీంకోర్టు కీలక విశ్లేషణ




## భారత్‌ను మిత్రదేశంగానే చూస్తాం: బంగ్లాదేశ్

- పరస్పర గౌరవంతో భారత్-బంగ్లా స్నేహం
- సరిహద్దు జలాల వివాదంపై ఢాకా కొత్త వ్యూహం
- భారత్‌ను మిత్రదేశంగానే భావిస్తామన్న బంగ్లా డిప్యూటీ స్పీకర్
- ఆధిపత్యం చెలాయించడాన్ని అంగీకరించబోమని స్పష్టీకరణ
- ఫరక్కా బ్యారేజీ ప్రతికూలతలతో పద్మా నదిపై మెగా ప్రాజెక్టుకు ఆమోదం




## దేశంలో చమురు నిల్వలున్నాయి

- అసత్యప్రచారం నమ్మొద్దు: కేంద్రం
- వైరల్ వీడియోపై పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ స్పష్టీకరణ
- '9 రోజులకు మాత్రమే నిల్వలు' అన్న ప్రచారం ఫేక్

## జవాబుదారీతనం కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం దేశానికి ప్రమాదకరం

పి.ప్రసన్న కుమార్ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి





## అణుహక్కుల విషయంలో రాజీపడబోం

- అమెరికాతో ఇరాన్ పరోక్ష చర్చలు
- అణు హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదని టెహ్రాన్ స్పష్టీకరణ
- పాకిస్థాన్ దౌత్యపరమైన మధ్యవర్తిత్వంతో వాషింగ్టన్, టెహ్రాన్ల రాయబారం

## కేరళలో కాంగ్రెస్

- సీఎంగా వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం
- తిరువనంతపురం సెంట్రల్ స్టేడియంలో వైభవంగా నిర్వహణ
- గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరణ
- బాధ్యతలు చేపట్టిన 20 మంది కేబినెట్ మంత్రులు
- జాతీయ, ప్రాంతీయ నేతల సమక్షంలో కొలువుదీరిన యూడీఎఫ్ సర్కార్



కేరళ వెలుతురు మే 18:

కేరళ రాజకీయాలలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. గత పదేళ్లుగా సాగుతున్న వామపక్షాల సుదీర్ఘ అధికారానికి గండి కొడుతూ, కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ కూటమి రాష్ట్రంలో అధికార పగ్గాలను అధికారికంగా చేపట్టింది. తిరువనంతపురంలోని చారిత్రాత్మక సెంట్రల్ స్టేడియంలో సోమవారం అత్యంత వైభవంగా, వేలాది మంది జన సందోహం మరియు విఐపిల సమక్షంలో ..మిగతా 2లో

## రోడ్లపై నమాజ్ లు వద్దు

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రజల రాకపోకల కోసం. ఎవరైనా రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించడం సమంజసం కాదు. ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు ఎవరికీ లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. తనను తరచూ కొందరు 'ఉత్తర్‌ప్రదేశ్‌లో రోడ్లపై నమాజ్‌లు జరగవా?' అని ప్రశ్నిస్తుంటారని యోగి తెలిపారు. అందుకు తాను 'ఇక్కడ అలాంటివి ఉండవు.. కావాలంటే వచ్చి చూసుకోండి' అని సమాధానం ఇస్తుంటానన్నారు. ప్రజా జీవనానికి ఆటంకం కలిగించే చర్యలను ప్రభుత్వం సహించబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణ అంశాన్ని కూడా యోగి ప్రస్తావించారు. 'కొంతమంది మాకు సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఎలా ఉంటాం అని అంటారు. దానికి మా సమాధానం చాలా స్పష్టం. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో స్థలం లేకుంటే జనాభాను కూడా నియంత్రించుకోవాలి' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. 'చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి పేర్కొన్నారు. మతపరమైన కార్యక్రమాల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలను ప్రభుత్వం అనుమతించదని స్పష్టం చేశారు. ప్రజా రవాణా, ట్రాఫిక్ వ్యవస్థకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దేశంలో చమురు నిల్వలున్నాయి

ఢిల్లీ వెలుతురు మే 18:
దేశంలో కేవలం తొమ్మిదిన్నర రోజులకు మాత్రమే సరిపడా చమురు నిల్వలు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై కేంద్ర ప్రభుత్వ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టత ఇచ్చింది. ఆ వీడియో పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పింది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్టు విడుదల చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా సాధారణంగానే కొనసాగుతోందని వెల్లడించింది.భారత్‌లో దాదాపు 60 రోజులకు సరిపడా చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయని పీఐబీ తెలిపింది. అంతేకాకుండా ఇంధన సరఫరా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి సమాచారాన్ని నమ్మకుండా, అధికారిక వర్గాలు విడుదల చేసే వివరాలనే విశ్వసించాలని పీఐబీ సూచించింది. ముఖ్యంగా ఫేక్ న్యూస్, మార్ఫింగ్ వీడియోలు, తప్పుడు ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

## వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

కరీంనగర్ వెలుతురు మే 18:
తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం పండించిన యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా రాబోయే వారం రోజుల్లోగా వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా అధికార యంత్రాంగాన్ని, రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియపై అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మిల్లుల వద్ద లారీలు రోజుల తరబడి వేచి ఉండకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల క్రితమే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం సేకరణపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ఆ దిశగా మొత్తం ప్రభుత్వ వ్యవస్థ అంతా సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తోందని తెలిపారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా, అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసిన 314 కొనుగోలు కేంద్రాలకు ఇప్పటికే 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుండి వచ్చి చేరిందని, జిల్లాకు నిర్దేశించిన ఈ లక్ష్యాన్ని వంద శాతం విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నొక్కి చెప్పారు.

## భారత్‌ను మిత్రదేశంగానే చూస్తాం: బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ వెలుతురు మే 18:
భారతదేశాన్ని బంగ్లాదేశ్ ఎల్లప్పుడూ ఒక అత్యంత నమ్మకమైన మరియు బలమైన మిత్రదేశంగానే పరిగణిస్తుందని, అయితే ఇరు దేశాల మధ్య ఉండే ఈ సుదీర్ఘ స్నేహబంధం కేవలం పరస్పర గౌరవం మరియు సమానత్వ ప్రాతిపదికన మాత్రమే ఆధారపడి ఉండాలని బంగ్లాదేశ్ పార్లమెంట్ నూతన డిప్యూటీ స్పీకర్ కైజర్ కమల్ అత్యంత స్పష్టమైన రీతిలో వ్యాఖ్యానించారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న అనూహ్య రాజకీయ అధికార మార్పిడి అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) ఘన విజయం సాధించి, ఫిబ్రవరి నెలలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాలలో తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పొరుగున ఉన్న పెద్ద దేశంతో నూతన ప్రభుత్వ సంబంధాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే అంశంపై అంతర్జాతీయ విలేకరులు అడిగిన వ్యూహాత్మక ప్రశ్నకు ఆయన సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. నిస్సందేహంగా భారత్, బంగ్లాదేశ్ రెండు దేశాలూ ఒకే విధమైన పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్నాయని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఈ ద్వైపాక్షిక బంధం ఒకరిపై మరొకరు ఆర్థిక లేదా రాజకీయ ఆధిపత్యం చెలాయించేదిగా కాకుండా, ఒకరి సార్వభౌమాధికారాన్ని మరొకరు గౌరవించుకునేలా మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు కేవలం కొంతమంది కీలక రాజకీయ వ్యక్తుల కేంద్రంగానో లేదా నిర్దిష్ట పార్టీల చుట్టూనో తిరగకూడదని, అవి పూర్తిగా ప్రజా సంబంధాల కేంద్రంగా రూపాంతరం చెంది సమాజంలోని అన్ని వర్గాల స్థాయికి బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కైజర్ కమల్ బంగ్లాదేశ్ వైఖరిని స్పష్టం చేశారు.

## జవాబుదారీతనం కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం దేశానికి ప్రమాదకరం

హైదరాబాద్ వెలుతురు మే 18:
కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమవడమే కాకుండా జవాబుదారీతనం లేని ప్రభుత్వంగా మారిపోయిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి.ప్రసన్న కుమార్ శర్మ తీవ్రంగా విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అనేక సంఘటనలను పదేపదే ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించే నరేంద్ర మోడీ తనను తాను "ఫకీర్"గా చెప్పుకుంటున్నప్పటికీ, దేశ ప్రజలకు జవాబుదారీతనం చూపడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. అలాగే కేంద్ర ప్రభుత్వంలోని పలువురు మంత్రులకు తమ శాఖలపై కనీస పట్టు కూడా లేదని అన్నారు. దేశంలోని ప్రతి మంత్రిత్వ శాఖలో ఏదో ఒక రూపంలో అవకతవకలు జరుగుతున్నాయని, అధికారాన్ని కొందరి చేతుల్లో కేంద్రీకరించి ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు, పేదలు, బడుగు బలహీన వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎన్నికల్లో గెలుపే పరమావధిగా పనిచేస్తోందని ఆయన అన్నారు. ఈ పరిస్థితులు దేశ సార్వభౌమత్వానికే ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# అణుహక్కుల విషయంలో రాజీపడబోం

పశ్చిమాసియా వెలుతురు మే 18:
పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు మరియు భౌగోళిక రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్న తరుణంలో, పాకిస్థాన్ రాయబార మధ్యవర్తిత్వం ద్వారా తాము అమెరికాతో నిరంతరం పరోక్ష చర్చలు జరుపుతున్నట్లు ఇరాన్ ప్రభుత్వం సోమవారం అధికారికంగా ధ్రువీకరించింది. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ ఉనికిని హెచ్చరిస్తూ అత్యంత ఘాటుగా అల్టిమేటమ్ జారీ చేసినప్పటికీ, తమ దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన అణు హక్కుల విషయంలో అంతర్జాతీయ శక్తులతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని టెహ్రాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి వ్యూహాత్మక వివరాలను వెల్లడించినట్లు స్థానిక వార్తా సంస్థ ఇస్నా ఒక ప్రత్యేక నివేదికలో పేర్కొంది. ఇస్లామాబాద్‌లోని పాకిస్థానీ దౌత్య అధికారుల ద్వారా వాషింగ్టన్‌తో ఇరాన్ తన సుదీర్ఘ అణు ప్రతిపాదనలను, పరస్పర సవరణ అంశాలను క్రమబద్ధంగా మార్పిడి చేసుకుంటోందని ఆయన సుదీర్ఘంగా వివరించారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య తెరవెనుక జరుగుతున్న ఈ ఉన్నత స్థాయి దౌత్యపరమైన చర్చలు కేవలం తాత్కాలికమైనవి కావని, ఇవి నిరంతరం సాగే ప్రక్రియ అని ఆయన నొక్కిచెప్పారు. అంతర్జాతీయంగా చురుకైన మరియు ప్రత్యామ్నాయ దౌత్య మార్గాలు అందుబాటులో ఉన్నప్పటికీ, ఇరాన్ తన వ్యూహాత్మక అణు కార్యక్రమం విషయంలో అత్యంత కఠినమైన మరియు స్థిరమైన వైఖరిని మాత్రమే అవలంబిస్తోందని విదేశాంగ ప్రతినిధి స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం కుదిరిన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం పరిమితులకు లోబడే తమ దేశ స్వయం సమృద్ధి కోసం యురేనియంను నిరంతరం శుద్ధి చేసుకునే చట్టబద్ధమైన హక్కు ఇరాన్‌కు ఉందని, దీనిపై ప్రపంచంలోని ఏ దేశంతోనూ తాము బేరసారాలు చేయబోమని బఘాయి వాషింగ్టన్‌కు ఖచ్చితమైన సందేశాన్ని పంపారు. ఈ అంతర్జాతీయ పరోక్ష దౌత్య ప్రక్రియ యొక్క అంతర్గత పరిణామాలను వివరిస్తూ, తాము ఇటీవల అమెరికా పరిశీలన కోసం సమర్పించిన 14 సూత్రాల సమగ్ర కార్యాచరణ ప్రణాళికపై వాషింగ్టన్ కొన్ని సాంకేతిక అభ్యంతరాలను వ్యక్తం చేసిందని ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ఆ తర్వాత అమెరికా ఆందోళనలను తాము నిశితంగా పరిశీలించి, ఇరాన్ భద్రతకు సంబంధించిన ప్రధాన ఆందోళనలను తిరిగి వాషింగ్టన్‌కు అధికారికంగా చేరవేశామని చెప్పారు.

## తెలంగాణలో క్రీడా వారోత్సవాలు ప్రారంభం

**(మొదటి పేజీ తరువాయి)**
జుంబా ప్రదర్శన అనంతరం క్రీడాకారుల్లో శారీరక శ్రమ మరియు ఫిట్‌నెస్ పట్ల అవగాహన కల్పించేందుకు నిర్వహించిన భారీ '5 కే వాకథాన్స కార్యక్రమాన్ని మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ కలిసి జెండా ఊపి ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ నడక సాగుతున్నంత సేపూ క్రీడాకారుల జయజయధ్వానాలతో హైదరాబాద్ నడిబొడ్డు మార్మోగిపోయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన దాదాపు 2,000 మందికి పైగా యువ క్రీడాకారులు, అథ్లెట్లు, విద్యార్థులు ఈ వాకథాన్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ నుండి ప్రారంభమైన ఈ సుదీర్ఘ నడక యాత్ర బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ మీదుగా సాగి, ఆపై సుందరమైన ట్యాంక్ బండ్ రహదారిని తాకుతూ, చారిత్రాత్మక అంబేద్కర్ మహావిగ్రహం పరిసరాల గుండా ముందుకు సాగింది. అక్కడ నుండి బూర్గుల రామకృష్ణారావు భవనం, ఈగల్ సర్కిల్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం మరియు అసెంబ్లీ కంట్రోల్ రూమ్ మీదుగా ప్రయాణిస్తూ, చివరకు ఎల్బీ ఇండోర్ స్టేడియం ప్రాంగణానికి చేరుకోవడంతో ఈ భారీ వాకథాన్ విజయవంతంగా ముగిసింది. రోడ్ల వెంట నడుస్తున్న క్రీడాకారులను ఉద్దేశించి మంత్రులు మాట్లాడుతూ, యువత తమ రోజువారీ జీవితంలో క్రీడలను ఒక భాగంగా చేసుకోవాలని, అప్పుడే ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి పునాది పడుతుందని ఆకాంక్షించారు. వాకథాన్ ముగిసిన తర్వాత ఎల్బీ ఇండోర్ స్టేడియం లోపల సమాజంలోని భిన్న వర్గాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యోగా మరియు మెడిటేషన్ (ధ్యానం) శిబిరాలు ప్రారంభమయ్యాయి. సమాజంలో వెనుకబడిన లేదా ప్రత్యేక శ్రద్ధ అవసరమైన దివ్యాంగులు, మహిళలు మరియు సీనియర్ సిటిజన్ల (వృద్ధుల) శారీరక, మానసిక ఉల్లాసం కోసం ఈ ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ ప్రశాంతమైన ధ్యాన కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్వయంగా పాల్గొని, యోగాసనాలు వేస్తూ అందరినీ ప్రేరేపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నేటి యాంత్రిక మరియు ఒత్తిడితో కూడిన జీవన విధానంలో మానసిక ప్రశాంతతను దక్కించుకోవడానికి, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి యోగా మరియు నిరంతర ధ్యానం ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉదయం పూట కొంత సమయాన్ని తమ ఆరోగ్యం కోసం కేటాయించాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ క్రీడా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్క యువకుడు, క్రీడా ప్రేమికుడు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు సాగనున్న ఈ సంబరాల్లో భాగంగా జిల్లాల వారీగా విభిన్న క్రీడా పోటీలను, యువజన సదస్సులను విస్తృతంగా నిర్వహించనున్నట్లు అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.

## కేరళలో కాంగ్రెస్ శకం ప్రారంభం

**(మొదటి పేజీ తరువాయి)**
జరిగిన బహిరంగ వేడుకలో కేరళ 13వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. కేరళ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆయన చేత నూతన ముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణంతో పాటు రహస్య విధి నిర్వహణ ప్రమాణాన్ని చేయించారు. ఈ చారిత్రాత్మక మైలురాయి కార్యక్రమానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రాతో పాటు దేశంలోని పలువురు కాంగ్రెస్ సీనియర్ అగ్రనేతలు తరలివచ్చారు. పొరుగు రాష్ట్రాల నుండి కాంగ్రెస్ ముఖ్యమంత్రులైన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు కూడా విచ్చేసి సతీశన్‌కు అభినందనలు తెలిపారు. ఈ వేడుకలో ఒక ప్రత్యేక ఆకర్షణగా కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) అగ్రనేత పినరయి విజయన్ స్వయంగా హాజరై, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ నూతన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు ఆయన కేబినెట్‌లో చోటు దక్కించుకున్న మరో 20 మంది నూతన శాసన సభ్యుల చేత గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కొత్త మంత్రివర్గంలో సరికొత్త రాజకీయ సమీకరణాలకు, యువ రక్తం మరియు అనుభవానికి కాంగ్రెస్ అధిష్ఠానం ప్రాధాన్యతనిచ్చింది

## భారత్-నార్వే సంబంధాలు బలోపేతం

**(మొదటి పేజీ తరువాయి)**
సంతరించుకుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, అంతర్జాతీయ నిబంధనలు, ప్రపంచ శాంతి పరిరక్షణలో భారత్, యూరప్ దేశాలు కలిసి పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచిన నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అంతర్జాతీయ సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు.ప్రపంచ దేశాలు కలిసి పనిచేసినప్పుడే శాంతి, భద్రతలను కాపాడగలమని అన్నారు. భారత్‌నార్వే మధ్య ఏర్పడిన గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయనున్నట్లు ప్రధాని వెల్లడించారు. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారిన నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్, సౌరశక్తి, పవన విద్యుత్, స్వచ్ఛ ఇంధన సాంకేతికతలలో రెండు దేశాలు కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. నార్వే సంస్థలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ప్రధాని మోదీ ఆహ్వానించారు. ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని, ఈ సమయంలో నార్వే సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెడితే రెండు దేశాలకు లాభదాయకమవుతుందని తెలిపారు. సముద్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కూడా భారత్, నార్వే కలిసి పనిచేయనున్నాయి. సముద్ర వనరుల వినియోగం, సముద్ర రవాణా, పోర్టుల ఆధునీకరణ, పర్యావరణహిత నౌకాశ్రయ సాంకేతికతలలో పరస్పర సహకారం పెంచనున్నట్లు ప్రధాని వెల్లడించారు. సముద్ర కాలుష్య నియంత్రణ, సుస్థిర మత్స్య సంపద అభివృద్ధి వంటి అంశాలపై కూడా సంయుక్తంగా పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతరిక్ష రంగంలో కూడా ఇరు దేశాలు కీలక అడుగులు వేస్తున్నాయి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ Indian Space Research Organisation, నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య కీలక ఒప్పందం కుదిరిందని ప్రధాని మోదీ వెల్లడించారు. అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహ సాంకేతికత, భూగోళ పరిశీలన రంగాల్లో పరస్పర సహకారం పెరగనుందని పేర్కొన్నారు. పరిశోధనల కోసం నార్వే సాంకేతిక సహకారం తీసుకుంటామని తెలిపారు.

## యూఏపీఏ చట్టంపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

ఢిల్లీ వెలుతురు మే 18:
ఉగ్రవాద నిరోధక చట్టమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదయ్యే అత్యంత కఠినమైన కేసుల్లో సైతం భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులదే పైచేయి అని సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన మైలురాయి లాంటి తీర్పును వెలువరించింది. దేశంలో సాధారణ క్రిమినల్ చట్టాల్లో వర్తించే "బెయిల్ అనేది ప్రాథమిక నియమం, జైలు అనేది మినహాయింపుష అనే రాజ్యాంగ సూత్రం, యూఏపీఏ వంటి ప్రత్యేక మరియు కఠిన చట్టాల పరిధిలోకి వచ్చే కేసులకు కూడా సమానంగా వర్తిస్తుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్‌కు చెందిన హైప్రొఫైల్ నార్కోటెర్రరిజం కేసులో నిందితుడిగా ఉండి, గత ఐదేళ్లుగా విచారణ పూర్తవకుండా జైలులోనే మగ్గుతున్న సయ్యద్ ఇఫ్తిఖార్ అంద్రాబీ అనే వ్యక్తికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఈ సంచలన వ్యాఖ్యలు చేసింది. విచారణలో విపరీతమైన ఆలస్యం జరుగుతున్నప్పుడు, కేవలం చట్టంలోని కఠిన నిబంధనలను అడ్డం పెట్టుకుని ఒక వ్యక్తిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు చెందిన జస్టిస్ బీవీ నాగరత్న మరియు జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సుదీర్ఘమైన వివరణలతో కూడిన ఈ చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. యూఏపీఏ చట్టంలోని సెక్షన్ 43డీ(5) ప్రకారం నిందితులకు బెయిల్ మంజూరు చేయడానికి కఠినమైన ఆంక్షలు మరియు పరిమితులు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ, ఆ నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు అలాగే ఆర్టికల్ 22 కల్పించిన న్యాయపరమైన రక్షణలకు లోబడి మాత్రమే పనిచేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏ నాగరిక సమాజంలోనైనా, చట్టబద్ధమైన పాలన సాగే దేశంలోనైనా "నేరం నిరూపించబడే వరకు నిందితుడు నిర్దోషే" అనే భావన న్యాయవ్యవస్థకు మూలస్తంభం లాంటిదని, దీనిని ఉగ్రవాద కేసులలో కూడా పూర్తిగా విస్మరించలేమని న్యాయమూర్తులు పేర్కొన్నారు. కేసు తీవ్రతను బట్టి అసాధారణ పరిస్థితుల్లో బెయిల్ నిరాకరించే అధికారం కోర్టులకు ఉన్నప్పటికీ, సుదీర్ఘకాలం పాటు విచారణను ప్రారంభించకుండా నిందితులను నిర్బంధించడం సమర్థనీయం కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా 2021లో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన ప్రసిద్ధ 'కేఏ నజీబ్' తీర్పును ప్రస్తుత ధర్మాసనం గట్టిగా సమర్థించింది. విచారణ ప్రక్రియలో తీవ్రమైన ఆలస్యం జరిగినప్పుడు నిందితుడి ప్రాథమిక హక్కుల రక్షణ కోసం యూఏపీఏ కేసుల్లో సైతం బెయిల్ ఇవ్వవచ్చని ఆ తీర్పు స్పష్టం చేసిందని గుర్తుచేసింది. ఈ 'కేఏ నజీబ్' తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని దిగువ కోర్టులు, ప్రత్యేక కోర్టులు, హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టుకు చెందిన తక్కువ సంఖ్యాక బెంచ్‌లకు కూడా ఖచ్చితంగా బైండింగ్ (వర్తిస్తుంది) అని, దీనిని ఎవరూ తక్కువ చేసి చూపలేరని లేదా పక్కన పెట్టలేరని ధర్మాసనం నొక్కిచెప్పింది. అదే సమయంలో, ఢిల్లీ అల్లర్ల కేసుల నేపథ్యంలో 'గల్ఫిషా ఫాతిమా' కేసులో సుప్రీంకోర్టులోని మరొక బెంచ్ ఇచ్చిన తీర్పుపై ప్రస్తుత ధర్మాసనం కొంత అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఆ కేసులో కేఏ నజీబ్ తీర్పులోని మార్గదర్శకాలను మరియు స్ఫూర్తిని సరైన రీతిలో అన్వయించలేదని న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం న్యాయవర్గాలలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీ అల్లర్ల కేసుల్లో ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ వంటి కార్యకర్తలకు ఇంకా బెయిల్ లభించని తరుణంలో ఈ వ్యాఖ్యలు రావడం విశేషం.

## తెలంగాణకు వర్ష సూచన

హైదరాబాద్ వెలుతురు మే 18:
తెలంగాణ రాష్ట్రంలో మరోసారి వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. ఒకవైపు ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముండగా.. మరోవైపు ఎండల తీవ్రత కూడా పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కపోత, వడగాలులతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వాతావరణశాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం మంగళ, బుధ (నేడు, రేపు) రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతం దక్షిణ భారత దేశంపై కొనసాగుతున్న ద్రోణి ప్రభావం, దానికి తోడు ఏర్పడిన ఉపరితల చక్రవాత ఆవర్తనం కారణంగా వాతావరణంలో అస్థిరత పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో తెలంగాణలోని అనేక జిల్లాల్లో మేఘావృత వాతావరణం నెలకొనే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం తర్వాత నుంచి సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.

## ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

**(మొదటి పేజీ తరువాయి)**
మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (NDMA) సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ఠ స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు.

# యువత క్రీడల్లో రాణించాలి










- **రాష్ట్రానికి గర్వకారణం కావాలి : మంత్రి వాకిటి శ్రీహరి**
- **యువజన–క్రీడా వారోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా ఘన ప్రారంభం**
- **ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత కార్యక్రమాలు**
- **జుంబా, వాకథాన్‌తో ప్రారంభమైన క్రీడా ఉత్సవాలు**
- **99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా భారీ క్రీడా కార్యక్రమాలు**
- **యువత భాగస్వామ్యంతో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రగతి ప్రణాళిక**
- **క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించాలని సూచన**
- **ఒలింపిక్స్‌లో పతకాల పెంపుపై ప్రభుత్వ లక్ష్యం**
- **గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు పెంపు**
- **సీఎం కప్ ద్వారా ప్రతిభావంతుల గుర్తింపు**
- **క్రీడా అభివృద్ధికి ప్రభుత్వ ప్రత్యేక ప్రాధాన్యం**

హైదరాబాద్ వెలుతురు మే 18:

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన మరియు క్రీడా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మే 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో స్టేడియం మొత్తం క్రీడా సందడి నెలకొంది.

ఈ సందర్భంగా నిర్వహించిన జుంబా కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొని యువతతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేశారు. అనంతరం 5 కిలోమీటర్ల వాకథాన్‌ను మంత్రులు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో యువత, క్రీడాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించేలా నినాదాలతో స్టేడియం మార్మోగింది. ఆరోగ్యకర జీవనశైలి, క్రీడల ప్రాధాన్యం, యువత శక్తి వంటి అంశాలపై అవగాహన కలిగించేలా కార్యక్రమాలు కొనసాగాయి.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ యువత శక్తి దేశ భవిష్యత్తుకు పునాది అని స్పష్టం చేశారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికి మాత్రమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తాయని ఆయన అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలను జీవనశైలిగా మార్చుకోవాలని సూచించారు.

ప్రతి రోజు కనీసం రెండు గంటలు మైదానంలో గడిపే అలవాటు పెంపొందించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్న సమస్యలకు కుంగిపోకుండా క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఓటమి వచ్చినప్పుడు తిరిగి గెలవాలనే ధైర్యాన్ని క్రీడలు నేర్పుతాయని ఆయన పేర్కొన్నారు.

భారతదేశం వంటి భారీ జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు రాకపోవడం బాధాకరమని మంత్రి అభిప్రాయపడ్డారు. చిన్న దేశాలు కూడా క్రమబద్ధమైన శిక్షణతో గొప్ప విజయాలు సాధిస్తున్నాయని గుర్తుచేశారు. తెలంగాణ యువతలో అపార ప్రతిభ ఉందని, సరైన ప్రోత్సాహం, ఆధునిక శిక్షణ అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వాలు క్రీడలను నిర్లక్ష్యం చేశాయని విమర్శించిన మంత్రి, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం కప్ వంటి పోటీలను నిర్వహిస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా యువతను ప్రతి కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. యువత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు.

ఈ యువజన మరియు క్రీడా వారోత్సవాలు యువత ప్రతిభను వెలికి తీయడానికి, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి మంచి వేదికగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కూడా ఈ ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగనున్నాయి.

# ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యం... విపత్తులపై తెలంగాణ అప్రమత్తం








- **అగ్నిప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు కీలకం**
- **రాష్ట్రవ్యాప్తంగా వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలపై భారీ మాక్ ఎక్సర్‌సైజ్‌లు**
- **నెక్లెస్ రోడ్‌లో వరద మాక్ డ్రిల్‌ను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్ వెలుతురు మే 18:-

ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన, శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ వరద మాక్ డ్రిల్‌ను సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ... విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట అత్యంత కీలకమని, ఆ "గోల్డెన్ అవర్" లో తీసుకునే చర్యలే ప్రాణాలను కాపాడగలవని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు, వరదలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. 1908లో హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి గోదావరి-కృష్ణా వరదలను ప్రస్తావించిన మంత్రి... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి... పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో మరింత సమర్థవంతమైన విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు.


మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్ ను సందర్శించి రెస్క్యూ కార్యకలాపాలను పరిశీలించారు.

తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా అధికారులను అభినందించారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఇవన్నీ పూర్తిగా ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా బాధ్యతాయుతమైన సమాచారమే ప్రజలకు చేరాలన్నారు.

ఈ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు.

పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు.

# మిస్టేక్ స్టెనో ఉద్యోగిది... సీఈని బద్నాం చేస్తే ఎలా?
## ఆర్ అండ్ బీలో ఇంజినీర్లు, అధికారులు విస్మయం



GOVERNMENT OF TELANGANA
ROADS AND BUILDINGS DEPARTMENT

From,
Sri. G. Rajeshwar Reddy, AMIE.,
Chief Engineer(R&B),
Buildings, Errummanzil.
Hvderabad

To,
The Commissioner
I&PR, AC guards,
Hyderabad.

Lr. No. : CE(B)/DEE2/AEE/Newhigh court complex Dt. 17.05.2026.

Sir,

Sub: CONSTRUCTION OF NEW HIGH COURT COMPLEX AT RAJEND[...] NAGAR – Rejoinder for news item published in METRO INDIA 14-05-2026 under caption "HC Project under cloud" - Regarding.

Ref: News item published in METRO INDIA on 14-05-2026 under captic[...] "HC Project under cloud".

***

The Commissioner I&PR is requested to arrange address Editor METRO INDIA to publish the Rejoinder for the news i[...] published in METRO INDIA on 14.05.2026 under the caption Project under cloud".

Encl: Rejoinder dated:17.05.2026.

Yours faithfully,
17/5/26
Chief Engineer (R
Buildings

హైదరాబాద్ వెలుతురు మే 18:

అది తెలంగాణ ఆర్ అండ్ బీ డిపార్టుమెంటు. రాష్ట్ర హైకోర్టు మీద ఒక పత్రిక తప్పుడు సమాచారంతో కథనం వండివార్చింది. దానికి స్పందన ఇవ్వాలి. రిజాయిండర్ ఆర్ అండ్ బీ డిపార్టుమెంటు ఆఫీసు రాసింది. కొంచం ఏమరపాటుతో అది మీడియాకు చేరింది. అయితే అందులో చిన్న తప్పు దొర్లింది. అది పూర్తిగా ఆఫీసు స్టేనో స్థాయి అధికారులు చూడాల్సిన పని చేయాలి. కానీ, దానికి ఒక సిన్సియర్ ఇంజినీర్‌ను బద్నాం చేయడం ఏమాత్రం హర్షణీయం కాదని అందరూ చర్చించుకుంటున్నారు. దీనిపై ఆర్ అండ్ ఇంజినీర్లు, అధికారులు ప్రస్తుతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తమ అన్వయ దోషాన్ని వెంటనే గమనించిన సదరు అధికారులు మళ్ళీ ఒక రివైజ్డ్ నోటు పంపించారు. కానీ, దీనికి సీఈ రాజేశ్వర్ రెడ్డిను బద్నాం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న హైకోర్టు భవన నిర్మాణంలో ఆయన తలమునకలై ఉన్నారని... అటువంటి సీనియర్ ఇంజినీర్ ను బద్నాం చేయడం సరికాదని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. కానీ, ఏం చేస్తాం... ట్రోలర్స్ తమ బుద్ధి మార్చుకోరు కదా. పండ్లు ఇచ్చే చెట్టుకు రాళ్ళు పడుతూనే ఉంటాయి కదా. షరా మాములే లే.



# తెలంగాణలో స్థిరంగా ఇంధన, ఎల్పీజీ సరఫరా : ఓఎంసీలు

వెలుతురు 18 మే 2026, హైదరాబాద్:

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలో ఓఎంసీల రాష్ట్ర కోఆర్డినేటర్ వెల్లడించారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయి.

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయటం లేదు. తెలంగాణలో ఈ నెలలో నిన్నటి వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశామనీ, ఈ సీజన్‌కు ఇది సాధారణమని ఓఎంసీలు తెలిపాయి. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ విధానమైన డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) వ్యవస్థను అనుసరించాలని కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం డీఏసీ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. రాష్ట్రంలో డీఏసీ అమలు శాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ఓఎంసీలు, గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి.

నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని.. విశ్వసనీయ సంస్థలు అందించే వార్తలను మాత్రమే విశ్వసించాలని సామాన్య ప్రజలకు ఓఎంసీలు మరోసారి విజ్ఞప్తి చేశాయి.

# వందలాది పేపర్ లీకులు జరిగాయి : అయినా విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయలేదు

- పెట్రోల్, డీజిల్, LPG కొరత వచ్చింది: అయినా పెట్రోలియం మంత్రి రాజీనామా చేయలేదు
- ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది: అయినా ఆర్థిక మంత్రి పదవి వదల్లేదు
- విదేశాంగ విధానం విఫలమైంది: అయినా విదేశాంగ మంత్రి కుర్చీకి అంటిపెట్టుకుని ఉన్నారు
- తరచూ భయానక రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి: అయినా రైల్వే మంత్రి తొలగించబడలేదు
- డజన్ల కొద్దీ ఉగ్రదాడులు జరిగాయి: అయినా హోంమంత్రి పదవిలోనే ఉన్నారు
- చైనా సరిహద్దుల్లోకి చొరబడి కూర్చుంది: అయినా రక్షణ మంత్రి కుర్చీ వదల్లేదు

*ఈ "న్యూ ఇండియా"లోని మోదీ ప్రభుత్వంలో ఎవ్వరూ తమ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయరు
ఎందుకో తెలుసా? ఎందుకంటే నరేంద్ర మోదీకి మీ ఓటుతో పెద్దగా సంబంధమే లేదని వాళ్లు భావిస్తున్నారు*

లేకపోతే ఇన్ని వైఫల్యాల మధ్య ఏ ప్రభుత్వమైనా ప్రజల ఆగ్రహానికి భయపడాలి. ప్రజలు




తమ సమస్యలకు, ఆవేదనకు ఎన్నికల్లో ఓడించి సమాధానం చెబుతారనే భయం ఉండాలి
కానీ మోదీకి అలాంటి భయం లేదని అంటున్నారు. ఎందుకంటే ఆయనకు ప్రజల ఓట్లతో గెలవాల్సిన అవసరం లేదని వారు నమ్ముతున్నారు ఎన్నికల్లో గెలవడానికి వాళ్ల వద్ద జ్ఞానేశ్ గుప్తా ఉన్నారు, ఎన్నికల కమిషన్ ఉంది, మొత్తం వ్యవస్థ తమ చేతిలో ఉందని విమర్శిస్తున్నారు

అందుకే మోదీ ప్రభుత్వంలో రాజీనామాలు ఉండవు, బాధ్యతలు నిర్ణయించబడవు, ఎవరికీ ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. అందుకే ప్రజలు తమ సమస్యలను అర్థం చేసుకుని భవిష్యత్తులో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.



పి.ప్రసన్న కుమార్ శర్మ
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

# హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు..
## : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మే 18:



సోమవారం 127-రంగారెడ్డి నగర్ డివిజన్, ఆదర్శ్ నగర్‌లోని జలమండలి కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన వివిధ కాలనీల వాసులు, బస్తీ వాసులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల వాసులు ,మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు,బిఆర్ఎస్ శ్రేణులు, భారీగా పాల్గొనగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ త్రాగునీటి సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, పాలకుల అనుభవ రాహిత్యం మరియు అవగాహన లోపం కారణంగా హైదరాబాద్ నగర ప్రజలు తీవ్ర త్రాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ ప్రజలకు 24 గంటల త్రాగునీటి సరఫరా అందిస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దాదాపు 2000 కోట్ల రూపాయల నిధులతో కిలోమీటర్ల మేర పైప్ లైన్ నిధులతో హైదరాబాద్ నగరానికి నాడు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్రాగునీటిని అందజేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమ అనాలోచిత నిర్ణయాలు, పరిపాలనా వైఫల్యాలతో రాష్ట్రాన్ని మళ్లీ కరువు పరిస్థితుల వైపు నెడుతోందని విమర్శించారు. హైదరాబాద్ నగర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బిఆర్ఎస్ ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల ద్వారా సమృద్ధిగా త్రాగునీటి సరఫరా అందించి ప్రజల దాహార్తిని తీర్చిందన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అవసరాలకు అనుగుణంగా నీటిని అందించడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

కాలనీలు, బస్తీలలో పాత మురుగునీరు వ్యవస్థ ఉండడంవల్ల సామర్థ్యానికి మించి మురుగు ప్రవహిస్తుండడంతో డ్రైనేజీ లీకై రోడ్లమీద పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మురుగునీటి సామర్థ్య పైప్ లైన్ లను నిర్మించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

జిహెచ్ఎంసి పరిధిని పెంచుతూ ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న గ్రామాలను కూడా జిహెచ్ఎంసి లో కలిపిన ప్రభుత్వం సరైన నిధులు ఇవ్వకపోవడం, గతంలో ఆర్డబ్ల్యూఎస్ శాఖ నిర్వహణలో ఉన్న త్రాగునీటి సరఫరా నేడు హెచ్ఎండబ్ల్యూఎస్ కు మారిన ఆర్డబ్ల్యూఎస్, హెచ్ఎండబ్ల్యూఎస్ శాఖల సమన్వయ లోపంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని, హైదరాబాద్ నగర ప్రజల త్రాగునీటి కష్టాలను వెంటనే పరిష్కరించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 24 గంటల త్రాగునీటి సరఫరాను అమలు చేయాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ ప్రజల త్రాగునీటి సమస్యల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే, ప్రజల పక్షాన పోరాడి వారి హక్కులను సాధించేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.జిహెచ్ఎంసి పరిధిని విస్తరిస్తూ ఔటర్ రింగ్ రోడ్ వెలుపల ఉన్న గ్రామాలను కూడా కలిపిన ఈ ముఖ్యమంత్రి, ఆయా గ్రామాలకు నీటిని సరఫరా చేసే వాటర్ వర్క్స్ బోర్డుకు మాత్రం సరిపడ నిధులు ఇవ్వలేదు.బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రతిఆడబిడ్డ కష్టం తీర్చిన మహా నాయకులు మన బిఆర్ఎస్ అధినేత కేసిఆర్...గడిచిన 3 ఏళ్లల్లోనే రేవంత్ సర్కార్ ఆధ్వర్యంలో నీటి సరఫరా బంద్ చేసి మునపటి బిందెలతో రోడ్లపైకి వచ్చేలా చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే.

ఇళ్లలోని వాటర్ పైప్ లలో వాటర్ ప్రెజర్ లేదు. రేవంత్ రెడ్డి గాలీ మోటర్ లో తిరిగి గాలి మాటలు మాట్లాడంలో మాత్రం ప్రెజర్ ఉంది.ఫ్యూచర్ లేని సిటీకి ఫ్యూచర్ గురించి మాట్లాడడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజలకు మంచి చేయడంలో లేదు. గాలిమోటర్ లో మూటలతో

డిల్లికి పోవుడు కాదు.. రిజర్వాయర్ ల చుట్టూ తిరిగి ప్రజల నీటి దప్పిక తీర్చు.కేసీఆర్ హయాంలో ఇంటింటికి త్రాగునీటిని అందించి ట్యాంకర్లను బంద్ చేయగా,నేడు రేవంత్ హయంలో నీటి ట్యాంకర్ల రోడ్డులపైకి తెచ్చింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.ప్రజలను గోస పెడ్తూ రాష్ట్రంలో కాసుల వేట,డబ్బుల మూటలను డిల్లికి చేర్చడమే రేవంత్ ధ్యేయం.తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీని చూపిస్తూ ఉన్న హైదరాబాద్ సిటీని విస్మరిస్తూ హైదరాబాద్ ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది ప్రభుత్వం.ప్రిన్సిపాల్ సెక్రటరీ,బోర్డ్ ఎండి తో మాట్లాడిన వాటర్ సప్లై పై చర్యలు శూన్యంగా ఉన్నది.

హైదరాబాద్ ప్రజలతో పాటు కుత్బుల్లాపూర్ ప్రజలనీటి కష్టాన్ని తీర్చకపోతే జూబ్లీహిల్స్ లోని రేవంత్ రెడ్డి ఇళ్లును ముట్టడించడం ఖాయం.

---

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
## : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 18:




సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే శ్రీ కేపీ. వివేకానంద్ హాజరయ్యారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సీలింగ్ మరియు రూఫ్ లీకేజీల కారణంగా నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, వెంటనే మరమ్మతులు చేపట్టి నివాసయోగ్యమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను కోరారు.అదేవిధంగా ఆయా ఇళ్ల సముదాయాల్లో నివసిస్తున్న ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రార్థనా మందిరాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని సూచించారు. అలాగే ప్రజల అవసరాల మేరకు వైకుంఠ ధామాల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పేద ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.అదనంగా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు చెత్త సకాలంలో తొలగింపు, కాలనీల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాను నిరంతరాయంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే అభివృద్ధి చేయాలని అధికారులను ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కోరారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పని చేసి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలను ఆదర్శవంతమైన నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు.

---

## రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ప్రజావాణికి (92)ఫిర్యాదులు




- **ప్రజలు ప్రజావాణిలో పెట్టుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలను అధికారులకు ఆదేశాలు**
- **జనగణన గృహజాబితా ప్రక్రియ వేగవంతం చేయాలి**
- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 18:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొం గరకలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలోసోమవారం సమీకృ త జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాని కి 92 ఫిర్యాదులు అందాయి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ స మస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు ఈ సందర్భంగా క లెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్ర మంలో ప్రజలు అందించే వినతులను సంబందిత శాఖల జిల్లాఅధికారులు తక్షణమే పరిష్కరిం చాలని ఆదేశించారు అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరి ష్కరించాలనిఅధికారులను ఆదేశించారు రెవెన్యూశాఖ 32,ఇతర శాఖలు 60 మొత్తం 92 దరఖ స్తులు అందాయి అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ జనాభా గణన2027 కా ర్యక్రమంలో భాగంగా ఎన్యు మరేట ర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధన లకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లిప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లే కుండా జాగ్రత్త వహించాలని ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు సర్వే ప్రక్రియను వేగవంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం ప ర్యవేక్షించా లని సూచించారు ప్రతి ఇంటిని కవర్ చేయాలని సూచించారు ఎన్యుమ రేటర్లు తమకు కేటా యిం చిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఏఒక్క కుటుంబం మిగలకుండా అన్ని కుటుంబాల వివరాలు నమో దు చేయాలని ఆదేశించారు సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని డిజిటల్ ఎంట్రీ లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు ఫీల్డ్ స్థాయిలో పని చేస్తున్న సిబ్బం ది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి ప్రజల సహకారం పొందాలని తెలిపారు ఇంటింటి సర్వే ప్రక్రియను అధికారులు నిర్దేశిత గడువులోపు చేయాలని ఆదేశించారుఈ కార్యక్రమంలో జి ల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డిరెవెన్యూ కిరణ్మయి లోకల్ బాడీస్ జిల్లా రెవెన్యూ అధికారి శారద వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ సూప రింటెండెంట్లు సంబంధిత అధికారులుతదితరులు పాల్గొన్నారు

---

# కార్మికుల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి:సిఐటియు

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 18:



నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ కార్మికులది ఆరు నెలల నుండి ESI, PF కట్టకుండా పెండింగ్ పెట్టడం సరికాదని క్రమం తప్పకుండా ESI, PF కట్టాలని, ప్రతి కార్మికుడికి జిహెచ్ఎంసి జీతాలు చెల్లించాలని, కనీస వేతనం 26000 ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సిఐటియు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ సైబరాబాద్ కార్పొరేషన్ లోని నిజాంపేట్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు జిహెచ్ఎంసిలో చెల్లిస్తున్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాదులో చెత్తాచెదారం లేకుండా శుభ్రత చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రకంగా కార్మికులను అధికారుల ద్వారా ఒత్తిడి చేపిస్తున్నారో అదే శ్రద్ధతో మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చెయ్యాలని, కనీస వేతనం రూ" 26000/ లుగా నిర్ణయించి అమలు చేయాలని ప్రభుత్వానికి కోరారు. మున్సిపల్ కార్మికులందరినికి సమాన పనికి సమాన వేతన చట్టం ప్రకారం పర్మినేంట్ కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను చెల్లించే విధంగా నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. విలీనం చేసిన మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ప్రమాదాల్లో మరణిస్తున్నా మున్సిపల్ కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులకు విజ్ఞప్తి చేశారు, వయస్సు మీరిన కార్మికులను తొలగిస్తే వారసులు ఉంటే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు ఇచ్చి, వారసులు లేని వారికి రూ.15లక్షలు ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు నిమిత్తం రూ. 30,000/లు మట్టి ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులకు ఏ విధంగా సెలవులు ఇస్తున్నారు, అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు ఆదివారాలు, పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీన్ని వాటర్ వర్క్స్ కార్మికులకు వర్తింపజేయాలి. 8 గంటల పని దినాన్ని అమలు చేయాలి.

సైబరాబాద్ కార్పొరేషన్ల పరిధిలోని ఎస్.ఎఫ్. ఎలకు, జవాన్లకు వర్క్ ఇనిస్పెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు.

మున్సిపల్ కార్మికులందరికీ మొదటి ప్రాధాన్యతనిచ్చి ఇల్లు లేని ప్రతి మున్సిపల్ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్స్, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. మున్సిపల్ కార్మికుల అటెండెన్స్ బయోమెట్రిక్ విధానంలో మార్పులు చేయాలి. పని ప్రదేశాల వద్దనే ఒక్కసారే హజరు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రభుత్వ అధికారులకు ఏ విధంగా నెల ఒక్కటో, రెండు తేదీల్లో జీతాలు పడతాయో అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు

నెలకు ఇచ్చే జీతాలు సరైన సమయంలో నెల మొదటి వారంలో కార్మికుడి అకౌంట్లో వేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల నుంచి కార్మికులకు ESI, PF కట్టకుండా పెండింగ్ వేసి అనేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న ESI, PF చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులను డిమాండ్ చేశారు. మున్సిపల్ నుంచి జిహెచ్ఎంసికి మారుతుంటే మా బతుకులు మారుతాయని అనుకున్న కార్మికులు కనీసం ESI, PF కట్టానికే జిహెచ్ఎంసి దగ్గర డబ్బులు లేనట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కార్మికుల ESI, PF డబ్బులను క్రమం తప్పకుండా చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులకు అందర్నీ తీసుకొని ఆందోళన నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎంసి తెలియజేస్తున్నాము. కార్మికుల సమస్యలు పరిష్కారం కానీ ఎడల ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ కార్యదర్శి పి.పెంటయ్య, సిఐటియు నాయకులు బాలపీర్, మదిలేటి, చెన్నయ్య, అంజి, బాలస్వామి, నాగలక్ష్మి, మనీ, బుజ్జమ్మ, మధు, రాములు, నరసింహ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

---

# "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణకు శంకర్‌పల్లి నుంచి శ్రీకారం

- **యోగా, మారథాన్‌తో యువతలో నూతనోత్సాహం"**

శంకర్‌పల్లి, వెలుతురు మే 18 :





ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - 99రోజుల ప్రత్యేక కార్యాచరణ"లో భాగంగా సోమవారం శంకర్‌పల్లి మండలంలోని మోకిల క్రీడా ప్రాంగణంలో వైభవంగా "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఎంపీడీఓ బి. గిరిరాజు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగా, ధ్యానం, మారథాన్ వంటి ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించారు. శంకర్‌పల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ సాత ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని యోగా ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్,వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, మున్సిపల్ మేనేజర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మోకిల సహకార సంఘం చైర్మన్ ఎలిమేల గోపాల్,మోకిలసర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్,దోబీపేట్ సర్పంచ్ శ్రీ రాఘవేందర్ రెడ్డి,వివిధ గ్రామాలసర్పంచులు, సూపరింటెండెంట్ శ్రీ గోపాలకృష్ణ, ఏపీఓ నాగభూషణం, గ్రామ వార్డు సభ్యులు, గోపాల్ రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, స్థానిక నాయకులు, యువజన సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆశీర్వాదం, రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

## మేడిపల్లి లో ఉన్న రెండు భారీ ట్యాంకులను నింపి ప్రతి ఇంటికి నీరు అందేలా చూడాలి....




- **మేడిపల్లి, పీర్జాదిగూడ ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించాలని HMWS అధికారులకు వినతిపత్రం అందజేసిన తుంగతుర్తి రవి**

మేడిపల్లి వెలుతురు మే 18:

సోమవారం రోజున మేడిపల్లి, పీర్జాదిగూడ పరిధిలోని పలు తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి గారు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (HMWS&SB) జనరల్ మేనేజర్ (GM) సంతోష్ కుమార్ గారికి మరియు DGM సరిత గారికి ఉప్పల్ జోన్ HMWS కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి గారు మాట్లాడుతూ.. మేడిపల్లి మరియు పీర్జాదిగూడ డివిజన్లలోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వినతిపత్రంలో ప్రధాన సమస్యలైన మేడిపల్లిలో ఉన్న రెండు భారీ రిజర్వాయర్ ట్యాంకులను పూర్తిగా నింపి, ప్రతి ఇంటికీ నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని,మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో జరుగుతున్న నీటి లీకేజీలను అరికట్టాలని, కాలం చెల్లిన పాత పైప్‌లైన్ల స్థానంలో నూతన పైప్‌లైన్లను రీప్లేస్ చేయాలని కోరారు.

తాగునీటి సౌకర్యం లేని పలు కాలనీలను గుర్తించి, అక్కడ కొత్తగా తాగునీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని జీఎం గారిని కోరారు.

ఈ కార్యక్రమం లో సోమయ్య, బర్రె నాగరాజు,పద్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

### శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి ఆధ్వర్యంలో 11వ సోమవారం అన్నదాన కార్యక్రమం

- **ఈ సోమవారం అన్నదాన ప్రభువు (కీర్తిశేషులు పాండాల సాయిలుగౌడ్ కుమారుడు) పాండాల కృష్ణ గౌడ్**

మంచాల వెలుతురు మే18:




మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీకంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిసోమవారంరోజు గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు ఈ సోమవారం అన్నదాన ప్రభువు పాండాల కృష్ణగౌడ్ తండ్రి (కీర్తిశేషులుపాండాల సాయిలుగౌడ్) జ్ఞాపకార్థంగా కుమారుడు పాండాల కృష్ణగౌడ్ సహకారం తో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ముందుగా గౌడ సంఘం పెద్దలు అన్నదాన ప్రభువు కం ఠమహేశ్వరస్వామికి శివలింగానికి ప్రత్యే కపూజలు చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభంచేశారు భక్తులకు దగ్గర ఉండి అన్నదాన ప్రసాదం వడ్డించిన అన్నదాన కార్యక్రమం కమిటీ సభ్యులు కొత్తప ల్లి శేఖర్ గౌడ్ ఎన్నుదుల మహేష్ నుకంరాజు ముదిరాజ్ ఈసందర్భంగా అన్నదాన ప్రభువు పాం డాల కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కంఠమహేశ్వర దేవాలయంలో అన్నదాన కార్యక్రమం చేయడం నా కు చాలా ఆనందంగా ఉంది అని అన్నారు కంఠమహేశ్వర దేవాలయ అభివృద్ధి కోసం నావంతు స హకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని అన్నారు ఈకార్యక్రమంలో అయ్యప్పస్వాముల గురుస్వామి మాజీ ఎంపీ టీసీ కావాలి శ్రీనివాస్ ముదిరాజ్ ఆరుట్ల గ్రామ ఉపసర్పంచ్ నుకం రాజు ముదిరాజ్ ఇందిరమ్మ కమిటీ చెరుకు నరసింహగౌడ్ సుంకరి జంగయ్యగౌడ్ అంతటి రాజుగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ సుంకరి ప్రవీణ్ గౌడ్ గడ్డం భాస్కర్ గౌడ్ పాండాల రాములు గౌడ్ పాశం బాలరాజుగౌడ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

---

## రైతులను వేధిస్తున్న ఎమ్మార్వో ను బదిలీ చేయాలి

శంకర్పల్లి, వెలుతురు మే 18 :



మండలంలో రైతులను ఎమ్మార్వో ఉద్దేశ్య పూర్వకంగా వేధిస్తున్నాడని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేకుర్త గోపాల్రెడ్డి ఆరోపించారు. వెంటనే ఎమ్మార్వోను బదిలీ చేయాలని ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎమ్మార్వో గత రెండు సంవత్సరాలుగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రజలతో దురుసుగా మాట్లాడుతున్నారని, డబ్బులు లేదని ఆరోపించారు. జిల్లాలోనే అత్యధిక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిగా ఆయన పేరొందారని విమర్శించారు. ఆర్ఐ స్థాయిలో పరిష్కరించాల్సిన ఫైళ్లను కారణాలు చెప్పకుండా తిరస్కరిస నుంచి వచ్చిన ఫైళ్లను సైతం పెండింగ్లో పెడుతున్నారని అన్నారు. మండలానికి చెందిన ఒక రైతు భూమి మ్యూటేషన్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కలెక్టర్కు ఫిర్యాదు ఒత్తిడి తెస్తె మాత్రమే పనులు చేస్తున్నారని, లేకపోతే ప్రజల పనులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే మండల పరిధిలోని ప్రొద్దటూరు గ్రామంలో ఓ ప్రముఖ వ్యక్తి చెరువు శిఖం భూమిలో కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నాడని అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, దీనిపై ఇరిగేషన్ అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా సాగదీస్తున్నాడని ఆరోపించారు. మంత్రులు, స్పందించి రైతులకు న్యాయం చేయాలని, ఎమ్మార్వోపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# హిమాయత్‌నగర్‌లో తాగునీటి సమస్యలపై కాంగ్రెస్ నేత రామన్ గౌడ్ ఫోకస్

- **విఠల్‌వాడి, జైస్వాల్‌బాడ తదితర ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందుల పరిశీలన**
- **కొత్త అపార్ట్మెంట్లతో పెరిగిన జనాభా**
- **పాత పైపుల వల్ల నీటి ఒత్తిడి తగ్గిందని ఆవేదన**
- **ప్రజల సమస్యలు తెలుసుకున్న జి. రామన్ గౌడ్**
- **జలమండలి అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన**
- **తక్షణ చర్యలు తీసుకుంటామని మేనేజర్ హామీ**
- **జైస్వాల్‌బాడలో నీటి సమస్యపై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందన**
- **బోరుబావి బదిలీతో ప్రాంతానికి పుష్కలంగా నీరు వచ్చే అవకాశం**

హైదరాబాద్ వెలుతురు మే 18:

హైదరాబాద్ నగరంలోని హిమాయత్‌నగర్ డివిజన్‌లో రోజురోజుకూ పెరుగుతున్న తాగునీటి సమస్యలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. డివిజన్ పరిధిలోని విటల్‌వాడి, జైస్వాల్‌బాడతో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆయన జలమండలి మేనేజర్ మున్నవర్‌తో కలిసి సోమవారం పర్యటించారు. స్థానిక కాలనీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, గత కొంతకాలంగా హిమాయత్‌నగర్ డివిజన్‌లో భారీ సంఖ్యలో కొత్త అపార్ట్మెంట్లు నిర్మాణం కావడంతో జనాభా గణనీయంగా పెరిగిందని తెలిపారు. అయితే, ప్రస్తుతం ఉన్న పాత పైప్‌లైన్ వ్యవస్థ మాత్రం అప్పటి జనాభాకు అనుగుణంగా ఉండటంతో, పెరిగిన అవసరాలకు సరిపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్న పరిమాణం ఉన్న పైపుల ద్వారా నీటి సరఫరా జరుగుతుండటంతో చాలాచోట్ల సరైన ప్రెషర్ రావడం లేదని, ఫలితంగా పై అంతస్తుల వారికి తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను శ్రద్ధగా విన్న జి. రామన్ గౌడ్, సమస్య తీవ్రతను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన జలమండలి మేనేజర్ మున్నవర్, సంబంధిత ప్రాంతాల్లో పైపులైన్ పరిస్థితిని పరిశీలించి, అవసరమైన చోట్ల కొత్త పైపులు ఏర్పాటు చేయడం, పాత లైన్లను విస్తరించడం వంటి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

పర్యటన సందర్భంగా జైస్వాల్‌బాడ ప్రాంతంలో గత నెలలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నిర్వహించిన పర్యటనను కూడా స్థానికులు ప్రస్తావించారు. ఆ సమయంలో కాలనీవాసులు తమ తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ప్రాంతంలో ఉన్న బోరుబావి స్థాన మార్పు చేపడితే నీటి సరఫరా మెరుగుపడుతుందని సూచించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే సూచనల మేరకు జలమండలి అధికారులు వెంటనే చర్యలు ప్రారంభించినట్లు తెలిసింది. బోరుబావి బదిలీ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అవి పూర్తయితే జైస్వాల్‌బాడ ప్రాంతానికి పుష్కలంగా నీరు అందే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీనితో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జి. రామన్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కొత్తగా నిర్మితమవుతున్న అపార్ట్మెంట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నీటి సరఫరా వ్యవస్థను కూడా ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అలాగే నగరంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పాత కాలనీల్లో ఉన్న చిన్న పైపులను పెద్ద పరిమాణం గల పైపులతో మార్పిడి చేయడం, నీటి ఒత్తిడి పెంచేందుకు అదనపు మోటార్లు, నిల్వ ట్యాంకులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

పర్యటనలో పలువురు స్థానిక నాయకులు, కాలనీవాసులు, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో తాగునీటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమై ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

# అప్పు ఇచ్చినవారినే హతమర్చారు

- **మొయినాబాద్ జంట హత్యల కేసులో సంచలన విషయాలు**
- **అప్పిచ్చిన మహిళలే టార్గెట్‌గా దారుణ పథకం**
- **ఇద్దరిని హత్య చేసి ఫాంహౌస్‌లో పాతిపెట్టిన నిందితులు**
- **మరో ఆరుగురిని కూడా హత్య చేసేందుకు కుట్ర**
- **పోలీసుల విచారణలో వెలుగుచూసిన భయంకర నిజాలు**
- **డబ్బుల కోసం ప్రాణాలు తీసిన కరీమా బేగం దంపతులు**
- **తోల్‌కట్ట ఫాంహౌస్‌గా మారిన హత్యల కేంద్రం**
- **ప్రాణభయంతో పోలీసులను ఆశ్రయించిన మహిళలు**
- **నిందితుల అరెస్టుతో బయటపడిన భయానక కుట్ర**

రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 18:

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో వెలుగుచూసిన జంట హత్యల కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. మొదట ఇద్దరు మహిళల అదృశ్యంగా ప్రారంభమైన ఈ కేసు.. ఇప్పుడు భారీ హత్య కుట్రగా మారి పోలీసులను కూడా షాక్‌కు గురిచేస్తోంది. అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేసిన మహిళలను ఒక్కొక్కరిని చంపేయాలని కరీమా బేగం, ఆమె భర్త రెహమాన్, బంధువు నయీం కలిసి పథకం రచించినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటికే ఇద్దరు మహిళలను దారుణంగా హత్య చేసిన నిందితులు.. మరో ఆరుగురినీ అదే తరహాలో అంతమొందించేందుకు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో బయటపడింది.




వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆబేదా బేగం, మహబూబాబీతో పాటు మరికొంత మంది మహిళలు కరీమా బేగం దంపతులకు, వారి బంధువు నయీంకు వివిధ సందర్భాల్లో అప్పుగా డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. అయితే చాలా కాలంగా అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో బాధిత మహిళలు తరచూ డబ్బుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పులు తీర్చలేమనే భావనకు వచ్చిన నిందితులు.. అప్పిచ్చిన వారినే హత్య చేయాలని పన్నాగం పన్నినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఈ కుట్రలో భాగంగా ముందుగా మహబూబాబీని డబ్బులు ఇస్తామని నమ్మించి మొయినాబాద్ సమీపంలోని తోల్‌కట్ట ప్రాంతంలోని ఓ ఫాంహౌస్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై దాడి చేసి గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో తేలింది. అనంతరం ముందుగానే సిద్ధం చేసిన గోతిలో మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తర్వాత ఇదే పద్ధతిలో ఆబేదా బేగంను కూడా అక్కడికే రప్పించి హత్య చేసి పాతిపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

ఇద్దరు మహిళలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో అనుమానాస్పద పరిస్థితులు కనిపించడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. విచారణలో భాగంగా కరీమా బేగం, రెహమాన్, నయీంను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా కీలక విషయాలు బయటపడ్డాయి. నిందితుల చెప్పిన సమాచారం మేరకు తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యాలాల ఎస్సై విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో బషీరాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ పోలీసు సిబ్బంది కలిసి ఫాంహౌస్ వద్ద తవ్వకాలు చేపట్టారు.

తవ్వకాలలో మొదట మహబూబాబీ అస్థిపంజరం బయటపడింది. అనంతరం మరో చోట ఆబేదా బేగం మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ప్రశాంతంగా కనిపించే ఫాంహౌస్‌లో ఇలాంటి దారుణాలు జరిగాయన్న విషయం తెలిసి ప్రజలు షాక్‌కు గురయ్యారు.

అయితే కేసు అక్కడితో ముగియలేదు. నిందితులను మరింత లోతుగా విచారించగా మరో సంచలన విషయం బయటపడింది. అప్పు ఇచ్చిన మరో ఆరుగురు మహిళలను కూడా అదే ఫాంహౌస్‌కు పిలిపించి హత్య చేయాలని నిందితులు ప్లాన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకోసం ఇప్పటికే వారికి ఫోన్ కాల్స్ కూడా చేసినట్లు సమాచారం. అయితే వివిధ కారణాలతో వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

ఇద్దరు మహిళల హత్య విషయం వెలుగులోకి రావడంతో మిగిలిన ఆరుగురు మహిళలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమకూ ప్రాణహాని ఉందని భావించి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వారికి భరోసా కల్పించి అవసరమైన రక్షణ చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఈ కేసు నేపథ్యంలో తాండూరు, మొయినాబాద్ ప్రాంతాల్లో ప్రజల్లో తీవ్ర కలకలం నెలకొంది.

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. నిందితులు అప్పుల భారంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. అప్పులు తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవడంతో అప్పిచ్చిన వారినే తొలగిస్తే సమస్య తీరుతుందనే దారుణ ఆలోచనతో ఈ హత్యలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. అలాగే హత్యలు బయటపడకుండా ఉండేందుకు ఫాంహౌస్‌ను ఎంచుకుని మృతదేహాలను పూడ్చిపెట్టడం వెనుక కూడా ముందస్తు ప్రణాళిక ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఈ కేసులో మరెవరైనా పాత్రధారులు ఉన్నారా? హత్యలకు ఉపయోగించిన వస్తువులు ఏమిటి? ఫాంహౌస్ యాజమాన్యం ఎవరిది? నిందితులు గతంలో కూడా ఇలాంటి నేరాలకు పాల్పడ్డారా? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అలాగే నిందితుల కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలు, మొబైల్ ఫోన్ వివరాలను కూడా విశ్లేషిస్తున్నారు.

రాష్ట్రంలో ఇటీవల వెలుగుచూసిన అత్యంత భయానక కేసుల్లో ఇదొకటిగా పోలీసులు భావిస్తున్నారు. ముఖ్యంగా అప్పుల వ్యవహారం హత్యలకు దారి తీసిన తీరు ప్రజలను కలవరానికి గురిచేస్తోంది. ఇద్దరు మహిళల ప్రాణాలు బలికావడంతో పాటు మరో ఆరుగురు కూడా ప్రమాదం అంచుల వరకూ వెళ్లారన్న విషయం ఈ కేసు తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది.

ప్రస్తుతం ముగ్గురు నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా అన్నమాచార్య జయంతి





హైదరాబాద్ వెలుతురు మే 18:

తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలంగాణ భాష సంస్కృతిక శాఖ,తెలుగు భాషా చైతన్య సమితి, జాతీయ తెలుగు సర్వస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో పథకవిత పితామహుడు అన్నమాచార్య 1618 జయంతి సభ రవీంద్ర భారతిలో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రాజేంద్ర కుమార్ పైడిపాటి మాట్లాడుతూ అన్నమాచార్య చేసిన కృషి ఎవరు మరువలేరు ఆయన రాసిన పాటలు తెలుగు భాషపులకరిస్తుంది ప్రతి ఒక్కరం మనం ఆయనని ఆరాధించడం ఆయన రాసిన పాటలు విని సంతోషంగా హాయిగా ఆహ్లాదంగా జీవించాలని తపన ఆ దేవదేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నాను ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలాచారి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఆమాచార్యకు ఒక పీజీ ఉంటుంది భక్తి సాహిత్యంలో ఆయన రాసిన కీర్తనలు తెలుగు ప్రజల అన్నమయ్యను దోచుకున్నారు ముచ్చకకు ఆయన ఆయన రాసిన కీర్తనలు బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటేఅనే కీర్తన మానవులందరూ సమానము ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ భేదం లేకుండా అందరూ సమానంగా బతకాలని ఈ సమాజంలో మనుషులందరూ సమానమే అని తాత్విక చింతన కలిగిన రుషి అన్నమయ్య అని ప్రతి తెలుగుఆడబిడ్డ అన్నమయ్య జోలపాట పాడి తన బిడ్డలను చిన్ననాటి నుండే భక్తి భావం అలవాటు చేసుకునే విధంగా బాల సాహిత్యాన్ని తల్లిదండ్రులు పిల్లలకు నేర్పిస్తారు అన్నమయ్య కీర్తనలు రావడానికి కృషి చేసిన వేటూరి ప్రభాకర్ శాస్త్రి ఆయన చేసిన కృషి మన మరువలేనిది అట్లనే తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆయన కీర్తనలు తాళపత్రాలపై ఉండి ఏమి రాసిండు అన్ని కీర్తనలు వెతికి తీసి తెలుగు ప్రజలకు అందించిన ఘనత అది తిరుమల తిరుపతి ట్రస్టు దక్కుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమానికి జాతీయ తెలుగు సరస్వతి పరిషత్ అధ్యక్షులు కేసిరాజు రాంప్రసాద్ సభా అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు ఆయన రాసిన పాటలు తెలుగు ప్రజల హృదయాలలో నిలిచి ఉన్నాయి అజరామము ఆయన గురించి ఎంత మాట్లాడిన తరిమి తీరదని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రామకృష్ణ చంద్రమౌళి,గంట మనోహర్ రెడ్డి, కుసుమ ధర్మన్న అలాపీఠం చైర్పర్సన్ రాధాకుసుమ, పివిపి అంజనీకుమారి, బైలూరు యోగేష్ ప్రభు, ప్రజ్ఞరాజు శ్రీమతి సరోజినీ దేవి,కార్యక్రమ నిర్వహణ పీ బడే సాబ్

## క్యాసారం గ్రామంలో ఘనంగా బీరప్ప స్వామి జాతర



- **ప్రజలపై ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి : కాట శ్రీనివాస్ గౌడ్**

క్యాసారం వెలుతురు మే 18:

క్యాసారం గ్రామంలో శ్రీ శ్రీ బీరప్ప స్వామి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ ఉత్సవంలో కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "బీరప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.

## నిరుద్యోగులకు భరోసా అయాన్ కోచింగ్ సెంటర్





- **రెండు లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి**
- **ఉద్యోగ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి లేదంటే ఉద్యమం తప్పదు**
- **ఆర్ కృష్ణయ్య రాజ్యసభ సభ్యులు**

ఎల్బీనగర్ వెలుతురు మే 18:

దిల్‌సుఖ్‌నగర్‌లో ఆయాన్ ఇన్‌స్టిట్యూట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ, పోటీ పరీక్షల కోసం శిక్షణ అందిస్తున్న మహమ్మద్ అన్వర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాత పరీక్షలతో పాటు ఫిజికల్ ట్రైనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా యువత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.

తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోని పోలీస్, విద్య, వైద్యం, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ లేకపోవడంతో నిరుద్యోగ యువత వయోపరిమితి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు త్వరగా పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో నీలం వెంకటేష్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి అనంతయ్య, విద్యార్థి సంఘం అధ్యక్షులు పగిళ్ల సతీష్, బీసీ సంఘం అధ్యక్షులు రాజేందర్, బీసీ సంఘం కన్వీనర్ శివకుమార్ యాదవ్, భీమరాజ్ యాదవ్, సెక్రెటరీ జనరల్ అంజి గౌడ్ గంజి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 20న మెడికల్ షాపులు బంద్

**నార్కట్ పల్లి వెలుతురు మే 18:** తహసీల్దార్, ఎస్ఐలకు వినతి పత్రం అందజేసిన నార్కెట్‌పల్లి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నార్కెట్‌పల్లి మండలంలో ఈ నెల 20వ తేదీ బుధవారం ఒక రోజు పాటు మెడికల్ షాపులు బంద్ నిర్వహించనున్నట్లు నార్కెట్‌పల్లి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రకటించింది. ద ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు, తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నార్కెట్‌పల్లి తహసీల్దార్ వెంకటేశ్వరరావు మరియు ఎస్ఐకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గర్దాస్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతూ, నార్కెట్‌పల్లి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో 20 మే 2026 బుధవారం రోజున మెడికల్ షాపులు బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు ముందుగానే మందులు కొనుగోలు చేసుకుని సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆన్లైన్ మందుల అమ్మకాలు, కార్పొరేట్ చైన్ ఫార్మసీలు ఇస్తున్న భారీ డిస్కౌంట్ల కారణంగా సాధారణ రిటైల్, హోల్సేల్ కెమిస్టులు తీవ్రంగా నష్టపోతున్నారని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఫార్మా రంగంలో పరిమిత లాభాలే ఉండటంతో, ఆన్లైన్ సంస్థల భారీ డిస్కౌంట్లను తట్టుకోవడం చిన్న, మధ్యతరహా వ్యాపారులకు కష్టంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సరాబు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి బిక్షం, కోశాధికారి మిర్యాల నాగేష్, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

# నార్కెట్‌పల్లిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

- **వడ్డేపల్లి నాగరాజు బీమ్ ఆర్మీ అధ్యక్షులు**

**నార్కట్ పల్లి వెలుతురు మే 18:** విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్‌కు భీమ్ ఆర్మీ వినతి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రాజెక్టులో భాగంగా నార్కెట్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని కోరుతూ భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేప



ల్లి నాగరాజు మాట్లాడుతూ, నార్కెట్‌పల్లి మండలంలో 80 శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఉన్నారని తెలిపారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం కష్టమై విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల నార్కెట్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే నార్కెట్‌పల్లి పట్టణ కేంద్రంలోని ZPHS హైస్కూల్‌లో అదనంగా మూడు తరగతి గదులు మంజూరు చేయడంతో పాటు విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మారీదు శివకృష్ణ, 6వ వార్డు సభ్యులు బకరం జనార్దన్, ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బోడ రావణ్ మహారాజ్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్కే జానీ, ఏపీ లింగోటం గ్రామ శాఖ అధ్యక్షుడు మెడబోయిన అశోక్, లింగాల దేవేందర్, ముప్పిడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జడల యషిల్ గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్ విద్యార్థికి 1లక్ష రూపాయలు నగదు ఆర్థిక సహాయం

**భువనగిరి టౌన్ మే 18 (వెలుతురు న్యూస్) :** ఇటీవల విడుదల అయిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా టాప్ ర్యాంకు భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ హై స్కూల్ విద్యార్థి సారా సాయి మాధవ్ 581/600 సాధించారు. వారి ఉన్నత చదువుల కొరకు యాదాద్రి భువనగిరి జిల్లా చెందిన జడల యషిల్ గౌడ్ (జె వై జి ) ఫౌండేషన్ చైర్మన్ జడల యషిల్ గౌడ్ ఇంటర్మీడియట్ చదువుకై పూర్తి బాధ్యత తీసుకున్నట్లు మరియు ముందస్తుగా నగదు 1లక్ష రూ ఆర్థిక సహాయం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్ చేతుల మీదుగా వారి



తండ్రి సారా మల్లేశం గౌడ్ కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి భవిష్యత్తు చదువులకై పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని భవిష్యత్తులో మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారి తండ్రి సార మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ నా కుమారుడి చదువుకై ఆర్థిక సహాయం అందజేస్తున్న జడల యషిల్ గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ డా.పగిడాల జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్మశానా వాటికల కబ్జా...అధికార పార్టీ 'డైవర్షన్ పాలిటిక్స్

- **చిరుమర్తి లింగయ్యపై బురదజల్లే కుట్రలు**

**నార్కట్ పల్లి వెలుతురు మే 18:** నకిరేకల్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలు, భూదాహం హద్దులు దాటాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులపై నిరంతరం పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ను రాజకీయంగా ఎదుర్కోలేక అధికార పార్టీ నేతలు కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష నేతలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ 'డైవర్షన్ పాలిటిక్స్' నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. నార్కెట్‌పల్లి మండలంలోని బొందలగడ్డ (స్మశాన వాటిక) భూములపై కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు విలాసవంతమైన భవనాలు, పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.



కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కడ భారీ విల్లా నిర్మించుకున్నారని, అదే ప్రాంతంలో పార్టీ కార్యాలయం కూడా ఏర్పాటు చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే స్థానిక ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా చెప్పబడుతున్న ఓ సర్పంచ్, బొందలగడ్డ పరిధిలోని భూములను కమర్షియల్ ప్లాట్లుగా మార్చి నిర్మాణాలు చేపట్టి లాభాలు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ నిజంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆ భూములను కబ్జా చేసి ఉంటే, ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు అక్కడ నిర్మాణాలు ఎలా చేపట్టారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. గత నెల రోజులుగా వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. తూకాల్లో మోసాలు, తరుగు పేరుతో దోపిడీ, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వంటి సమస్యలపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడుతున్నారని తెలిపారు. రైతులకు అండగా నిలుస్తూ అధికార పార్టీ వైఫల్యాలను బయటపెడుతుండటంతోనే ఆయనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గానికి గణనీయమైన అభివృద్ధి జరగలేదని, గ్రామాల్లో కనీస మౌలిక వసతుల పనులు కూడా చేపట్టలేదని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులు భూకబ్జాలు, రాజకీయ వేధింపులతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సాగునీరు, తాగునీరు, రోడ్ల అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆయనకు పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేకే ఈ దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

# కొణతం బక్కారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం



**మోత్కూర్, మే 18,(వెలుతురు న్యూస్ ):** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కొణతం బక్కారెడ్డి 16వ వర్ధంతిని ఈరోజు మోత్కూర్ కేఆర్ భవన్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ,చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాచికంటి లక్ష్మి నరసయ్య గారు హాజరయ్యారు.బక్కారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి తదనంతరం పాసికంటి లక్ష్మి నరసయ్య మాట్లాడుతూ బక్కారెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై యువజన సంఘం లో చేరి యువజన సమస్యలపై నిరంతరం పోరాటం చేసినాడు అని అలాగే సిపిఐ పార్టీలో ప్రాంతీయ కార్యదర్శిగా జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులుగా రాష్ట్ర పార్టీ కౌన్సిల్ మెంబర్గా అనేకమార్లు పనిచేసినాడు ఈ ప్రాంత సమస్యలపై రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా ఈ ప్రాంతానికి పునాదిగాని కాలువ ద్వారా రైతులకు సాగునీరు తాగునీరు అందించాలని అనేకమార్లు పాదయాత్రలు ,బైకు ర్యాలీలు నిర్వహించడం జరిగిందని ఒక మారు రావన్నపేట శాసనసభ్యుగా పోటీ చేసి 23 వేల ఓట్లు సాధించిన ఘనత బక్కారెడ్డి గారికి దక్కిందని నేటి యువత వారి ఆశయాల కోసం నిరంతరం పోరాటం చేయాలని ఈ ప్రాంతానికి పునాది గాని ద్వారా నీళ్లు రైతులకు అందించినప్పుడే వారికి నిజమైన నివాళి అని వారు తెలిపారు .ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి సహాయ కార్యదర్శి అన్నెపు వెంకట్ పుల్లకరంమల్లేష్ గీత పనివారలసంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య పట్టణ కార్యదర్శి బోయిన ఉప్పలయ్య .తాడూరు లక్ష్మీనరసయ్య .బీసీ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పెండం వెంకటేశ్వర్లు .పోచం కన్నయ్య. తాపీ సంఘం పట్టణ అధ్యక్షులు .ఎండి పాషా ,ఎడ్ల ఆనందు జంగలింగం బొడ్డుపల్లి వెంకన్న ,ఎండి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి




- **- కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కారుపోతుల వెంకట్ గౌడ్**

**మోత్కూర్, మే 18, (వెలుతురు న్యూస్ ):** పెట్రోల్, డీజిల్, వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు,కౌన్సిలర్ కారుపోతుల వెంకట్ గౌడ్ పత్రిక విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు.ధరలను నిరంతరం పెంచుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరోసారి ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేసిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం లో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను కేవలం పన్నులు చెల్లించే కీలు బొమ్మలు గా మాత్రమే చూస్తుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, CNG, వాణిజ్య ఎల్పీజీ ధరల పెంపు వల్ల మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు, హోటళ్లు, రవాణా కార్మికులు, రైతులు, దినసరి కూలీలు నష్ట పోతున్నారని తెలిపారు, రవాణా ఖర్చులు పెరగడం వల్ల ప్రతి నిత్యవసరల వస్తువులు ధర స్వయంచాలకంగా పెరిగి ద్రవ్యోల్బణం మరింత అధికమవు తుందన్నారు. ప్రజల ప్రయోజనాల కంటే ఆదాయం వసూళ్లు, ఎన్నికల రాజకీయాల పైనే బిజెపి ప్రభుత్వం దృష్టి పెట్టిందని విమర్శించారు. ఈ వైఫల్యానికి పెట్రోలియం మంత్రి వెంటనే బాధ్యత వహించి ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నాడు నిధుల వెల్లువ – నేడు నిశ్శబ్దం

**నార్కట్ పల్లి వెలుతురు మే 18:** నకిరేకల్ నియోజకవర్గ ప్రగతిపై ప్రత్యేక విశ్లేషణ నకిరేకల్ నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా జరిగిన అభివృద్ధిపై ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హయాంలో నియోజకవర్గం సాధించిన అభివృద్ధి, భారీ నిధుల సమీకరణను ప్రస్తుత పరిస్థితులతో పోల్చితే స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనలో రికార్డు స్థాయిలో నిధులు మంజూరై నియోజకవర్గ ముఖచిత్రం మారిపోయిందని చెబుతున్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ రూ.5 కోట్లతో 23 రైతు వేదిక భవనాలు నిర్మించగా, రూ.16 కోట్లతో 126 వైకుంఠధామాలు, రూ.19 కోట్లతో 126 పల్లె ప్రకృతి వనాలు, రూ.5 కోట్లతో 8 బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. యువత కోసం రూ.5 కోట్ల వ్యయంతో 128 క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 2018 నుండి 2023 వరకు రైతుబంధు పథకం కింద 93,365 మంది రైతులకు రూ.991.06 కోట్ల పెట్టుబడి సాయం అందించగా, రైతు భీమా ద్వారా రూ.46.55 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 10,217 మంది లబ్ధిదారులకు రూ.104.3 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తూ రూ.234.01 కోట్ల అంచనా వ్యయంతో 15,201 గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. నిరుపేదల సామాజిక భద్రత కోసం 42,872 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా సుమారు రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.604.35 కోట్ల ఆసరా పెన్షన్లు పంపిణీ చేసినట్లు పేర్కొంటున్నారు.




పట్టణ, గ్రామీణ మౌలిక సదుపాయాల పరంగా కూడా భారీ పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఒక్క నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోనే రూ.32 కోట్లతో 100 పడకల ఆధునిక ఆసుపత్రి భవనం, రూ.26 కోట్లతో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, అంతర్గత సీసీ రోడ్ల కోసం రూ.20 కోట్లతో సహా మొత్తం రూ.67.60 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. కేతేపల్లి, కట్టంగూర్, నార్కెట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం మరో రూ.165 కోట్లను వెచ్చించి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారని పేర్కొంటున్నారు. దళితబంధు పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రయోగాత్మకంగా 100 యూనిట్లకు రూ.10 కోట్లు కేటాయించడం కూడా విశేషంగా చెప్పుకుంటున్నారు. ఇలా గతంలో కోట్లాది రూపాయల నిధులు నియోజకవర్గానికి వచ్చి అభివృద్ధి పనులు వేగంగా జరిగితే, ప్రస్తుతం ఆ స్థాయి నిధుల సమీకరణ గానీ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలు గానీ కనిపించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. నాడు కనిపించిన నిధుల వెల్లువతో పోలిస్తే, నేడు నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా మందగించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సామాజిక సేవలకు అంతర్జాతీయ గుర్తింపు

- పెద్దపట్ల మంజులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డు...
- కరోనా కష్టకాలంలో నిరుపేదలకు అండగా నిలిచిన సేవలకు ప్రశంసలు...
- ఢిల్లీలో ఘనంగా అవార్డు ప్రదానం...
- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మంజుల పిలుపు...




**జహీరాబాద్ వెలుతురు మే 18:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పెద్దపట్ల మంజులకు ప్రతిష్ఠాత్మక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డు లభించింది. సమాజ సేవలో ఆమె చేసిన విశేష కృషిని గుర్తిస్తూ భారతీయ అవార్డ్స్ సంస్థ, వైష్ణవి జన కళ్యాణ్ ఫౌండేషన్ సహకారంతో ఈ అవార్డును ప్రదానం చేసింది. ప్రస్తుతం సమాజంలో చాలా మంది స్వార్థ ప్రయోజనాలకే పరిమితమవుతున్న తరుణంలో, పెద్దపట్ల మంజుల మాత్రం ప్రజా సేవను తన ధ్యేయంగా ఎంచుకుని నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, తనకు తోచిన సహాయాన్ని అందిస్తూ అనేక కుటుంబాలకు అండగా నిలిచారు. ఆహారం, నిత్యావసర వస్తువులు అందించడం, బాధితులకు ధైర్యం చెప్పడం వంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. మంజుల చేసిన సేవలను గుర్తించిన భారతీయ అవార్డ్స్ సంస్థ ఆమెను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది. ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రశంసా పత్రం, మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు. 1984లో స్థాపించబడిన భారతీయ దళిత సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యమకారులు, రచయితలు, కవులు, కళాకారులు, సామాజిక సేవకులను గుర్తించి ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ అవార్డు అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా ఉందని పెద్దపట్ల మంజుల తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు మంజులను అభినందించారు.




# రామారారం గ్రామంలో విద్యుత్ షాక్ తో మహిళా మృతి



**గుండాల మే18(వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని రామారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది గ్రామానికి చెందిన కనగంటి దేవరాజ్ భార్య కనగంటి మంజుల సోమవారం ఉదయం ఇంటిలో బండలు శుభ్రం చేస్తున్న సమయంలో మోటార్ వైరు తొలగించే క్రమంలో చూసుకోకుండా వైరు జెయింట్ వద్ద ఉన్న టేపు ఊడిపోవడంతో గమనించకపోవడం వలన కరెంటు షాక్ తగిలి కింద పడి పోవడం తో మోత్కూర్ వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఐదో వార్డు సభ్యురాలిగా ఎన్నికయ్యారు మృతురాలి భర్త దేవరాజు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై ఎం శోభన్ బాబు కేసు నమోదు చేసుకొని శవ పంచనామ నిర్వహించి జరిగిన సంఘటన పై వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతుదేహని ఆలేరు ఏరియా హాస్పిటల్ కి తరలించారు

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం..!

- దాహార్తి తీర్చేందుకు సొంత ఖర్చులతో ఉచిత చల్లటి తాగునీరు అందిస్తున్న చిరు వ్యాపారులు...




**జహీరాబాద్ వెలుతురు మే 18 :** ఎండలు మండిపోతున్న ఈ వేసవి కాలంలో దాహంతో అలమటిస్తున్న ప్రయాణికులకు అండగా నిలుస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని కొందరు చిరు వ్యాపారులు మానవత్వాన్ని చాటుతున్నారు. జాతీయ ప్రధాన రహదారిపై స్థానిక అతిథి గృహం సమీపంలో వ్యాపారం నిర్వహిస్తున్న వీరు, తమ సొంత ఖర్చులతో ప్రతిరోజూ ఉచితంగా చల్లని తాగునీటిని అందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, కార్మికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన స్థానిక చిరు వ్యాపారులు మానవత్వంతో ముందుకు వచ్చి ప్రజలకు తాగునీటి సేవలు అందించాలనే నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ప్రతి రోజు సుమారు పది వాటర్ క్యాన్లను ఏర్పాటు చేసి, రహదారిపై వెళ్లే ప్రతి ఒక్కరికీ ఉచితంగా నీరు అందిస్తున్నారు. ఈ సేవల వల్ల వాహనదారులు, ప్రయాణికులు ఎంతో ఉపశమనం పొందుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో తీవ్ర ఎండల కారణంగా అలసిపోయిన ప్రయాణికులు ఇక్కడ ఆగి నీరు తాగుతూ చిరు వ్యాపారుల సేవలను అభినందిస్తున్నారు. ఎటువంటి ప్రచారం లేదా లాభాపేక్ష లేకుండా సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం సమాజంలో స్వార్థపూరిత ఆలోచనలు పెరుగుతున్న తరుణంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. చిన్న స్థాయిలో వ్యాపారం చేసుకుంటూ కూడా సమాజానికి ఉపయోగపడే విధంగా సేవలు అందించడం ఆదర్శప్రాయమని పలువురు కొనియాడుతున్నారు. "మానవ సేవే మాధవ సేవ" అనే భావనతో చిరు వ్యాపారులు చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వేసవి కాలం ముగిసే వరకు ఈ ఉచిత తాగునీటి సేవలను కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

# ఎస్ఐహెచ్ఎంకు పూర్వ వైభవం తీసుకువస్తాం: మంత్రి జూపల్లి కృష్ణారావు






- జహీరాబాద్‌లో ఘనంగా పర్యాటక వారోత్సవాలు...
- బేకరీ కోర్సులు, నిథమ్ బీబీఏ–ఎంబీఏ అడ్మిషన్ల ప్రారంభం...
- పేద విద్యార్థులకు స్టైఫండ్ అందించే దిశగా చర్యలు...

**జహీరాబాద్ వెలుతురు, మే 18:** పేద విద్యార్థులు, చదువుకున్న నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలి గ్రామంలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. సంస్థను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఎస్ఐహెం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను ప్రారంభించారు. అలాగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించారు. పర్యాటక శాఖ రూపొందించిన "టూరిస్ట్ గైడ్" పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం గ్రామీణ ప్రాంత యువతకు వృత్తి విద్య అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎస్ఐహెం సంస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయితే కొంతకాలంగా నిరుపయోగంగా మారిన ఈ సంస్థను తిరిగి చైతన్యవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా ఉండేందుకు స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యువత హాస్పిటాలిటీ, పర్యాటక రంగాల్లో ఉన్న అపార అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో ప్రపంచం ఒక కుగ్రామంగా మారిందని, ప్రైవేట్ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విదేశీ భాషలపై కూడా పట్టు సాధించాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణకు మంత్రి సూచనలు చేశారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు కూడా ఉపాధి ప్రధానమైన కోర్సుల వైపు వారిని ప్రోత్సహించాలని కోరారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి సాధించే దిశగా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ లేక ప్రజావాణిలో తగ్గిన పిర్యాదులు





**వెలుతురు నారాయణఖేడ్ మే 18 :** సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ లోని సబ్ కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి సబ్ కలెక్టర్ లేకపోవడంతో ప్రజల నుండి పిర్యాదులు తగ్గాయి.సోమవారం ప్రజావాణికి కేవలం 14 పిర్యాదులు మాత్రమే వచ్చాయి.విధి నిర్వహణలో భాగంగా సబ్ కలెక్టర్ ఎన్.ఉమా హారతి ఆయా మండలాలలోని వరి కొనుగోలు కేంద్రాల తనిఖీకి వెళ్లడంతో నారాయణఖేడ్ తహసీల్దార్ హసీనా బేగం ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించారు.సబ్ కలెక్టర్ లేరు అని తెలుసుకున్న చాలామంది వెనుదిరిగి వెళ్లిపోయారు. కొంతమంది డివిజన్ మరియు మండల స్థాయి అధికారులు కూడ 12:30 గంటల నుండే ప్రజావాణి నుండి బయటకు వెళ్లిపోవడం విశేషం. సోమవారం వచ్చిన పిర్యాదులలో ఎక్కువగా భూములకు సంబంధించినవే ఉన్నాయి.ఖేడ్ పట్టణంలోని చాలామంది వ్యాపారస్థులు తమ వ్యాపార పరిధి దాటి రోడ్లపై సామాగ్రి ఏర్పాటు చేసి ట్రాఫిక్ జామ్ కు కారణం అవుతున్నారని పుండరీకం అనే వ్యక్తి,తాలుక పరిధిలో ప్రతీ గ్రామం,తాండాలలో ఎక్సైజ్ అధికారుల అండదండలతో బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని, వాటి వల్ల మగవారు మద్యానికి బానిసలుగా మారి భార్యలను కొడుతూ, పచ్చని సంసారాలు పాడుచేసుకుంటున్నారు,బెల్టు దుఖానాలపై చర్యలు తీసుకోవాలంటూ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్.ఆనంద్ పిర్యాదు చేశారు.సబ్ కలెక్టర్ ఉంటేనే ప్రజావాణికి పిర్యాదులు వస్తాయని స్పష్టంగా కనబడుతుంది.ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అస్తానే ఖాద్రీయ బగ్దాల్ షరీఫ్ ఉర్సులో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖిజర్ యాఫై

- డా. మొహమ్మద్ ఇద్రీస్ ఖాద్రి ఆశీర్వాదం.. శాలువా, మెమెంటోతో ఘన సత్కారం...
- కులమతాలకు అతీతంగా సన్మార్గంలో నడవాలని పిలుపు...





**జహీరాబాద్ వెలుతురు, మే 18:** ఎన్నో వందల సంవత్సరాల క్రితం మంచి సమాజ నిర్మాణం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భక్తి మార్గాన్ని ఎంచుకుని జీవితాలను త్యాగం చేసిన మహనీయుల ఘనత అస్తానే ఖాద్రీయ బగ్దాల్ షరీఫ్‌కు దక్కిందని ఖిజర్ యాఫై అన్నారు. ఆదివారం రాత్రి బాగ్దాల్ గ్రామంలో గల అస్తానే ఖాద్రీయ బాగ్దాల్ షరీఫ్ 469వ జాతర ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఖిజర్ యాఫై పాల్గొన్నారు. దర్గా సజ్జాదే నషీన్, జహీరే నిగ్రాని డా. మొహమ్మద్ ఇద్రీస్ ఆహేమద్ ఖాద్రి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆయన దర్గాకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఖిజర్ యాఫై దర్గా నిర్వాహకులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా. మొహమ్మద్ ఇద్రీస్ ఖాద్రి కూడా ఖిజర్ యాఫైకు శాలువా కప్పి మెమెంటో అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఖిజర్ యాఫై, అస్తానే ఖాద్రీయ బగ్దాల్ షరీఫ్‌కు ప్రత్యేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పేందుకు సూఫీ సంతులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుస్తూ కులమతాలకు అతీతంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శేఖపూర్ గ్రామ సర్పంచ్ మొహమ్మద్ చేష్మొద్దీన్, ఆరిఫ్ అలీ, హమీద్ రహేమని, సదర్ ఇసాక్ మియా, కోడ్పల్ షేక్ ఆహేమద్, మసుల్దార్ గౌసొద్దీన్, ఖలేద్ ముసవాలె, సద్దాం కుసంగి, ఇస్మాయిల్ బిలాల్‌పూర్, మొహమ్మద్ సైఫ్, ఖాజా పటేల్, సిరాజ్ బిలాల్‌పూర్, మక్సూద్ ఖాన్, రహిమోద్దీన్ టేలర్, గుల్బర్గా వాలే తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తగిరి ఆశ్రమాన్ని సందర్శించిన సివిల్ కోర్టు జడ్జి కవితా దేవి

- అధికమాస పూజల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు...
- పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన అర్చకులు...
- ఆశ్రమ పీఠాధిపతుల చేతుల మీదుగా సన్మానం...

**జహీరాబాద్ వెలుతురు మే 18:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో గల శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమాన్ని జహీరాబాద్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కవితా దేవి సందర్శించారు. ఆశ్రమంలో నిర్వహిస్తున్న అధికమాస వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ రాజగోపురం వద్ద వైదిక పాఠశాల విద్యార్థులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని జ్యోతిర్లింగాలను దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే దైవ స్వరూపిణి అనసూయ మాత ఆనంద నిలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమంలో నిర్వహించిన రుద్రయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిమయ వాతావరణాన్ని నెలకొల్పాయి. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానంద గిరి మహారాజ్ జడ్జి కవితా దేవిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కోర్టు సిబ్బంది, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



# ఉత్తరప్రదేశ్‌లో రహదారులు రక్తసిక్తం

- వేర్వేరు ఘటనల్లో 17 మంది దుర్మరణం
- లఖీమ్‌పుర్ ఖీరీ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం
- ట్రక్కును ఢీకొట్టిన టాటా మ్యాజిక్ వాహనం
- పొట్టకూటి కోసం వెళ్తుండగా కాటేసిన కాలం
- కూలీల జీవితాల్లో నిండిన తీరని చీకట్లు
- నుజ్జునుజ్జు అయిన ప్రయాణికుల వ్యాన్
- శిథిలాల నుండి మృతదేహాల వెలికితీత
- ప్రమాద ఘటనపై యూపీ సీఎం యోగి దిగ్భ్రాంతి
- అమేఠీలో ప్రయాణికుల బస్సులో చెలరేగిన మంటలు
- డ్రైవర్, కండక్టర్ సమయస్ఫూర్తితో తప్పిన ముప్పు
- బహ్రైచ్-నేపాల్ సరిహద్దు రహదారిపై కారు ప్రమాదం
- షాజహాన్‌పూర్‌లో ఆటోరిక్షాను ఢీకొట్టిన ట్రక్
- అక్కడికక్కడే ముగ్గురు అక్కడికక్కడే మృతి
- రాష్ట్రవ్యాప్తంగా రక్తాసిక్తమైన రహదారులు

**ఉత్తరప్రదేశ్ వెలుతురు మే 18:**



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గత ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సంభవించిన వేర్వేరు ఘోర రహదారి ప్రమాదాలు భారీ ప్రాణనష్టాన్ని మిగిల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో జరిగిన నాలుగు వేర్వేరు దుర్ఘటనలలో మొత్తం 17 మంది ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాలయ్యారు. వీటిలో అత్యంత ఘోరమైన ప్రమాదం లఖీమ్‌పుర్ ఖీరీ జిల్లాలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం పూట కూలి పనుల కోసం ప్రయాణికులతో వెళ్తున్న ఒక చిన్న వ్యాన్, వేగంగా వెళ్తున్న ట్రక్కును వెనుక నుండి బలంగా ఢీకొనడంతో 10 మంది దుర్మరణం పాలయ్యారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, అత్యవసర రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను కాపాడి సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, మృతదేహాలను స్వాధీనం చేసుకుని తదుపరి ప్రక్రియ నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ వరుస ప్రమాదాల వార్త తెలుసుకున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని ప్రకటించారు. లఖీమ్‌పుర్ ఖీరీ పోలీసు అధికారులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, జిల్లాలోని ఊంచ్ గ్రామం సమీపంలో గల సిసైయా జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఈ భీకర ప్రమాదం సంభవించింది. ఒక టాటా మ్యాజిక్ ప్రయాణికుల వాహనంలో డ్రైవర్‌తో పాటు సుమారు 12 మందికి పైగా ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. వీరంతా రోజువారీ కూలి పనుల నిమిత్తం లఖీమ్‌పుర్ ఖీరీ పట్టణ ప్రాంతానికి వెళ్తున్నట్లు సమాచారం. ప్రయాణికులలో ఎనిమిది మంది పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. ప్రయాణంలో ఉండగా ఒక్కసారిగా వాహనం డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో, టాటా మ్యాజిక్ వాహనం ముందు వెళ్తున్న పెద్ద ట్రక్కును అత్యంత వేగంగా వెనుక వైపు నుండి ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగానికి ఆ చిన్న వ్యాన్ పూర్తిగా నలిగిపోయి నుజ్జునుజ్జు అయింది. వాహనం శిథిలాల మధ్య ప్రయాణికులు ఇరుక్కుపోయి ఆర్తనాదాలు చేయడంతో, ఆ శబ్దాలు విన్న చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హైవేపైకి పరుగెత్తుకుంటూ వచ్చారు.
ఈ ప్రమాద స్థలంలో దృశ్యాలు అత్యంత హృదయ విదారకంగా మారాయి. వాహనం లోపలి భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో, మృతదేహాలను మరియు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారిని బయటకు తీయడం స్థానికులకు, పోలీసులకు కత్తిమీద సాములా మారింది. గ్యాస్ కట్టర్లు, ఇతర ఇనుప పరికరాల సహాయంతో వాహన భాగాలను కట్ చేసి, అత్యంత క్లిష్టమైన పరిస్థితుల మధ్య మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘోర దాటికి తొమ్మిది మంది ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న మరో ఐదుగురిని పోలీసులు సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మరొకరు మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య పదికి చేరింది. మిగిలిన నలుగురు బాధితుల పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. మరణించిన వారంతా రోజువారీ శ్రామికులు కావడంతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల పూర్తి వివరాలను సేకరించేందుకు పోలీసులు ప్రస్తుతం ప్రయత్నిస్తున్నారు. ఈ ఘోర ప్రమాదంపై లఖ్నో నుంచి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తక్షణమే స్పందించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ప్రభుత్వ ఖర్చులతో అత్యుత్తమ మరియు ఉచిత వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేస్తూ, రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని లఖీమ్‌పుర్ ఖీరీ జిల్లా కలెక్టర్, ఎస్పీలను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇదిలా ఉండగా, ఉత్తరప్రదేశ్‌లోని అమేఠీ జిల్లాలో సోమవారం ఉదయం ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సులో ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించినప్పటికీ, కేవలం డ్రైవర్, కండక్టర్ల అప్రమత్తత మరియు సమయస్ఫూర్తి వల్ల ఒక భారీ ప్రాణనష్టం తృటిలో తప్పింది. సుమారు 35 మంది ప్రయాణికులతో ఈ బస్సు ప్రయాగ్‌రాజ్ ఫైజాబాద్ జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తోంది. దుర్గాపూర్ మార్కెట్ ప్రాంతానికి చేరుకోగానే బస్సు ఇంజిన్ క్యాబిన్ నుండి దట్టమైన పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడు. ప్రమాదాన్ని ముందే ఊహించిన అతడు వెంటనే బస్సును రోడ్డు పక్కన సురక్షితంగా ఆపి, ప్రయాణికులను అలర్ట్ చేశాడు. కండక్టర్ తక్షణమే బస్సు అత్యవసర తలుపులు తెరిచి, ప్రయాణికులందరినీ సామాన్లతో సహా కిందకు దించేశాడు. ప్రయాణికులు కిందకు దిగిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించి, వాహనం పూర్తిగా అస్థిపంజరంగా మారిపోయింది. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఆదివారం రాత్రి వేళ బహ్రైచ్-నేపాల్ అంతర్జాతీయ రహదారిపై జరిగిన మరొక ఘోర ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. బహ్రైచ్ నగరానికి చెందిన ఆరుగురు స్నేహితులు ఒక కారులో ప్రయాణిస్తుండగా, ఎదురుగా అతివేగంగా వస్తున్న ఒక కంబైన్ హార్వెస్టర్ (పంట కోసే భారీ యంత్రం) వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు రోడ్డు పక్కన ఉన్న లోతైన అగాధంలోకి పడిపోయింది. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే హార్వెస్టర్ డ్రైవర్ వాహనాన్ని వదిలిపెట్టి చీకట్లోకి పారిపోయాడని, అతడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని బహ్రైచ్ పోలీసులు వెల్లడించారు. ఇదే సిరీస్‌లో, షాజహాన్‌పూర్ జిల్లాలోని కాంత్ పట్టణం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన మరో రహదారి ప్రమాదంలో ఒక మహిళ సహా ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. జలాలాబాద్ రహదారి గుండా ప్రయాణికులతో వెళ్తున్న ఒక ఆటోరిక్షాను ఎదురుగా వస్తున్న ఒక భారీ వేగవంతమైన ట్రక్కు నిర్లక్ష్యంగా ఢీకొట్టింది. ఆటోరిక్షాను ట్రక్కు చాలా దూరం ఈడ్చుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే నలిగిపోయి మరణించారు. ఆటోలో ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ వరుస రోడ్డు ప్రమాదాలు ఉత్తరప్రదేశ్‌లో వాహనాల వేగ నియంత్రణ, రహదారి భద్రతా నియమాల అమలుపై పలు ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. రవాణా శాఖ అధికారులు హైవేలపై నిఘా పెంచాలని, అతివేగంగా నడిపే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

---

# ఏపీలో జూన్ 1 నుంచి ఖరీఫ్ సాగునీటి విడుదల



- అన్నదాతలకు మంత్రుల భరోసా, ముందస్తు ప్రణాళికలు సిద్ధం
- సచివాలయంలో ఖరీఫ్-2026 సాగునీటి సరఫరాపై సమీక్ష
- పాల్గొన్న మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల
- జూన్ మొదటి తేదీ నుంచే కాలువలకు నీటి పంపిణీ షెడ్యూల్

**అమరావతి వెలుతురు మే 18:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాబోయే ఖరీఫ్2026 వ్యవసాయ సీజన్‌ను అత్యంత విజయవంతంగా నిర్వహించేందుకు మరియు రైతులకు ఎక్కడా సాగునీటి కొరత రాకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం ముందస్తు వ్యూహాత్మక చర్యలను ప్రారంభించింది. ఇందులో భాగంగానే రాష్ట్ర సచివాలయంలో సోమవారం నాడు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలిసి ఉమ్మడిగా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సాగు పనుల కోసం జూన్ 1వ తేదీ నుంచే కాలువల్లోకి సాగునీటిని అధికారికంగా విడుదల చేయనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. సకాలంలో సాగునీరు అందుతుండటంతో అన్నదాతలు అందరూ ఎలాంటి ఆందోళనలు పెట్టుకోకుండా ముందస్తుగా ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలువల చివర ఆయకట్టు (టెయిల్ ఎండ్) భూములకు సైతం సమర్థవంతంగా నీరు చేరాలనే ఉద్దేశంతో, కాలువల్లో ఉన్న పూడికలను మరియు గుర్రపుడెక్కలను తొలగించే పనులను మే నెల ఆఖరి నాటికి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత వినూత్న సీజన్ అయిన 2025 26 ఖరీఫ్‌లో ప్రభుత్వం 99.35 లక్షల ఎకరాల విస్తీర్ణానికి ఏకంగా 888 టీఎంసీల నీటిని విజయవంతంగా సరఫరా చేసిందని, అలాగే తదుపరి రబీ సీజన్‌లో కూడా 23.67 లక్షల ఎకరాలకు గాను 153 టీఎంసీల నీరు అందించి రైతాంగాన్ని ఆదుకుందని మంత్రులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రధాన మరియు మధ్యతరహా రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అత్యంత ఆశాజనకంగా అందుబాటులో ఉందని, అందువల్ల సాగునీటి పంపిణీకి ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ నదీ పరివాహక ప్రాంతాలు మరియు డెల్టా ఆయకట్టుల కింద సాగవుతున్న భూములకు ఎప్పుడు, ఏ ఏ సమయాల్లో నీటిని విడుదల చేయాలో వివరిస్తూ మంత్రులు ఒక పటిష్టమైన కాలపట్టికను (షెడ్యూల్) విడుదల చేశారు. ప్రభుత్వం రూపొందించిన ఈ అధికారిక ప్రణాళిక ప్రకారం, పచ్చని గోదావరి డెల్టా పరిధిలోని తూర్పు, పశ్చిమ మరియు మధ్య కాలువలకు జూన్ 1వ తేదీ నుంచే సాగునీటిని ప్రవహింపజేస్తారు. ఆ తర్వాత కృష్ణా డెల్టా పరిధిలోని వ్యవసాయ భూముల అవసరాల కోసం జూలై 1వ తేదీ నుండి కాలువలకు నీటిని వదలనున్నారు. రాయలసీమ ప్రాంతంలో కీలకమైన కేసీ కెనాల్ ఆయకట్టు కింద ఉన్న పొలాలకు జూలై 15వ తేదీ నుండి, అలాగే నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల పరిధిలోని సువిశాల ఆయకట్టు స్థలాలకు జూలై చివరి వారం నాటికి పూర్తి స్థాయిలో సాగునీటిని విడుదల చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి జీవనాడి అయిన వంశధార ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని రైతులకు జూన్ 15వ తేదీ నుండి కాలువల ద్వారా నీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని మంత్రులు వెల్లడించారు. ఈ నిర్ణీత గడువుల ప్రకారం నీరు విడుదల చేయడం ద్వారా రైతులు సకాలంలో నారుమళ్లు పోసుకుని, నాట్లు వేసుకోవడానికి వీలవుతుందని, తద్వారా పంటల దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు, ఖరీఫ్2026 వ్యవసాయ ప్రణాళికల అమలుపై మరియు అంతర్జాతీయంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల తలెత్తే ఎల్ నినో ప్రభావంపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల అధికారులతో ప్రత్యేక వర్చువల్ (వీడియో కాన్ఫరెన్స్) సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను సమీక్షించిన అనంతరం, విత్తనాలు మరియు రసాయన ఎరువులను రైతులకు ఎక్కడా కొరత రాకుండా ఆర్బీకే కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచామని మంత్రి వెల్లడించారు. ఇదే తరుణంలో పంపిణీ యంత్రాంగాన్ని ఉద్దేశించి ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ, రైతుల కోసం కేటాయించిన ఎరువులు, పురుగుల మందులు పక్కదారి పట్టినా లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలించినా సంబంధిత అధికారులపై అత్యంత కఠినమైన క్రిమినల్ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. యూరియా అక్రమ నిల్వలు, వేస్ట్ వాడకాన్ని అరికట్టేందుకు ఈసారి రైతులకు ప్రత్యేక యూరియా కార్డులను అందజేస్తామని, రైతులు తమ అవసరానికి అనుగుణంగా ఆ కార్డుల ద్వారా మాత్రమే యూరియా తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు ముందస్తుగా ఎరువులను తెచ్చి ఇళ్లలో నిల్వ పెట్టుకోవద్దని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రెండు లేదా మూడు దశల్లో ద్రవ రూపంలో ఉండే అధునాతన 'నానో యూరియా'ను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా సాగుతున్న యుద్ధ వాతావరణం మరియు భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా విదేశాల నుండి యూరియా దిగుమతులకు కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గమనించి రైతులు తమ పొలాలకు యూరియాను కేవలం అవసరం ఉన్న మేరకే పరిమితంగా వాడాలని, వృధా చేయవద్దని మంత్రి అచ్చెన్నాయుడు ఈ సందర్భంగా హితవు పలికారు.

---

# ఖైదీలలో పరివర్తన కోసమే జైళ్లు




- తిరుపతి స్పెషల్ సబ్ జైల్లో హోం మంత్రి అనిత ఆకస్మిక తనిఖీ
- అకస్మాత్తుగా సందర్శించి రికార్డులను, వసతుల పరిశీలన
- ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యతపై ఆరా
- జైలు లోపలి భద్రతపై అధికారులతో సుదీర్ఘ చర్చ
- సామర్థ్యానికి మించి ఉన్న ఖైదీల సంఖ్యపై ఆందోళన
- 120 మందికి బదులుగా 140 మంది ఉన్నట్లు గుర్తింపు
- సబ్ జైలు ప్రస్తుత 70 సెంట్ల విస్తీర్ణాన్ని పెంచడంపై సమీక్ష
- సంచలన కేసుల వేగవంతమైన విచారణ కోసమే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు
- అవసరమైతే మరిన్ని పెంచుతామని వెల్లడి
- జైలు అధికారులు, పోలీస్ వ్యవస్థ వేర్వేరు
- ఖైదీలతో మానవీయ కోణంలో మెలగడంపై మంత్రి ప్రశంసలు
- జైళ్ల శాఖలో సమూల ప్రక్షాళనకు ప్రణాళికలు
- పెరోల్‌పై వెళ్లే నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు
- త్వరలో పోలీస్, ఫైర్, జైళ్ల శాఖల్లో భారీగా ఉద్యోగాల భర్తీ

**తిరుపతి వెలుతురు మే 18:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తిరుపతి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం స్థానిక స్పెషల్ సబ్ జైలును అత్యంత ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జైలు ప్రాంగణానికి చేరుకున్న హోం మంత్రి, అక్కడ ఖైదీల ఉనికి, వారికి అందుతున్న రోజువారీ వసతులు, ఆరోగ్య సంరక్షణ చర్యల గురించి జైలు ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. జైలులోని బారకాసులు, వంటగది, ఖైదీల బంధీఖానా పరిసరాలను స్వయంగా పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జైళ్లు అనేవి కేవలం నేరస్థులను బంధించి ఉంచే శిక్షా కేంద్రాలు మాత్రమే కావని, తప్పు చేసిన వ్యక్తులలో పరిపూర్ణమైన సత్ప్రవర్తనను, మార్పును తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన పునరావాస కేంద్రాలని మంత్రి గుర్తుచేశారు. తిరుపతిలో ఉన్న ఈ స్పెషల్ సబ్ జైలు విస్తీర్ణం ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా లేదని, జైలులో కేవలం 120 మంది ఖైదీలను ఉంచడానికి మాత్రమే వీలుండగా, ప్రస్తుతం ఇక్కడ అంతకంటే ఎక్కువగా 140 మంది ఖైదీలు ఉన్నట్లు విచారణలో తేలిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సబ్ జైలు కేవలం 70 సెంట్ల పరిమిత భూమిలోనే కొనసాగుతోందని అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ ఇరుకు ఇబ్బందులను తొలగించడానికి ప్రస్తుత జైలు విస్తీర్ణాన్ని పెంచాలా లేక నగర శివార్లలో అత్యాధునిక వసతులతో సరికొత్త భవనాన్ని నిర్మించాలా అనే అంశాన్ని ప్రభుత్వం త్వరలోనే పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి జైలులోనూ ఖైదీల ప్రాణాలకు రక్షణ కల్పించడం, వారికి సరైన భద్రతను ఏర్పాటు చేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. కేవలం జైలు గోడల మధ్యే కాకుండా బయటి సమాజంలోకి వెళ్లాక కూడా మాజీ ఖైదీల్లో నిజమైన జీవన పరివర్తన రావాల్సిన అవసరం ఉందని ఆమె ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సంచలనం సృష్టించిన దారుణ నేరాలు, మహిళలపై వేధింపుల కేసులను అత్యంత త్వరితగతిన విచారించి బాధితులకు తక్షణ న్యాయం చేయడమే కాకుండా నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చూడటం కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని వివరించారు. బాధితుల పక్షాన నిలబడటంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, న్యాయ ప్రక్రియ మరింత వేగవంతం కావడానికి అవసరమైతే రాష్ట్రంలో మరిన్ని కొత్త ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి కూడా ముఖ్యమంత్రి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా వెల్లడించారు. జైలు సిబ్బంది విధులు, సాధారణ పోలీస్ శాఖ విధులు పూర్తిగా భిన్నమైనవని పేర్కొన్న హోం మంత్రి, జైలు అధికారులు ఖైదీలతో నిరంతరం దగ్గరగా ఉంటూ వారి మానసిక స్థితిని అధ్యయనం చేస్తూ, వారిలో సాజి విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఒక గురువులా, మార్గదర్శిలా శ్రమిస్తున్నారని కొనియాడారు. సమాజ రక్షణను దృష్టిలో ఉంచుకుని జైళ్ల శాఖలో త్వరలోనే భారీ ప్రక్షాళన కార్యక్రమాలను చేపడుతున్నట్లు మంత్రి అనిత ప్రకటించారు. ముఖ్యంగా వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తన పేరిట లేదా అత్యవసర కారణాలతో జైలు నుండి పెరోల్ పై తాత్కాలికంగా బయటకు వచ్చే నేరస్థుల కదలికలపై ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసుల సహాయంతో నిరంతర నిఘా ఉంచుతున్నామని, పెరోల్ నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేయడంలో భాగంగా హోం శాఖ పరిధిలోని అన్ని విభాగాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విడుదల చేయబోయే వార్షిక జాబ్ క్యాలెండర్ ద్వారా పోలీస్ శాఖతో పాటు ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను అత్యంత పారదర్శకమైన పద్ధతిలో భర్తీ చేయడానికి అవసరమైన నియామక ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని నిరుద్యోగ యువతకు మంత్రి అనిత భరోసా ఇచ్చారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో హోం మంత్రితో పాటు జైళ్ల శాఖ రీజనల్ అధికారులు, స్థానిక పోలీస్ ఉన్నతాధికారులు మరియు జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు





- **భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద మ్యూజియం**
- **అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి**
- **పర్యాటక గైడ్‌లకు ప్రత్యేక శిక్షణ.. నియామకాలు**
- **రూ. 5 కోట్లు కేటాయిస్తామన్న మంత్రి**

**హైదరాబాద్, వెలుతురు మే 18:** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావు. అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ (Guide) లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరిన్టెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ (INTACH) కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌కు సీఎం పంగనామాలు

- **మహేష్ కుమార్ గౌడ్‌ను అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి**
- **రేవంత్‌పై బీజేపీ ఎంపీ తీవ్ర విమర్శలు**
- **నిజామాబాద్‌కు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్న ఎంపీ ధర్మపురి అరవింద్**




**నిజామాబాదు వెలుతురు మే 18:** నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జిల్లాకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం నిజామాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను రాజకీయంగా అణగదొక్కేందుకే నిజామాబాద్ జిల్లాకు ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని అరవింద్ ఆరోపించారు. “ఇంకా ఏ ముఖం పెట్టుకుని మహేష్‌కుమార్ గౌడ్ నిజామాబాద్ జిల్లాలో తిరుగుతున్నారు?” అంటూ ప్రశ్నించారు. జిల్లాకు అవసరమైన అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు మరిచిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారు తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం రాజకీయ ప్రచారాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. “దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయడం పెద్ద విషయం కాదు” అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై అరవింద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. నిజామాబాద్ నగరంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిస్థితిపై కూడా ఎంపీ అరవింద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పనులు ఆశించిన స్థాయిలో సాగడం లేదన్నారు. ఇప్పటివరకు నగరంలో 25 శాతం పనులు కూడా పూర్తికాలేదని పేర్కొన్నారు. రూ.162 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు ప్రభుత్వం కేవలం రూ.10 కోట్లు మాత్రమే యూడీసీకి విడుదల చేసిందని ఆరోపించారు. నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. నగర ప్రజలు డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రచారం ఎక్కువ.. పనులు తక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ రాజకీయాలపై కూడా అరవింద్ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. “2039 వరకు రాహుల్ గాంధీ ప్రధాని కాలేరు” అని సీఎం స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. అంటే వచ్చే పదేళ్ల పాటు దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోనే ఉంటుందని రేవంత్ పరోక్షంగా ఒప్పుకున్నట్లేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై కూడా అరవింద్ స్పందించారు. రేవంత్ రెడ్డి స్థానంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంటి జెన్యూన్ వ్యక్తిని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ అగ్రనేతలకు సూచించారు. రాష్ట్రాన్ని నడిపే విషయంలో రేవంత్ కంటే కోమటిరెడ్డి మెరుగైన నాయకత్వాన్ని అందించగలరని అభిప్రాయపడ్డారు. బుల్లెట్ రైల్ కారిడార్ అంశంపై సీఎం చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అరవింద్ విమర్శించారు. ప్రజలను ఆకట్టుకునేందుకు అసాధ్యమైన హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బుల్లెట్ రైల్‌పై ప్రభుత్వం చెబుతున్న మాటల్లో స్పష్టత లేదన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ అంశంపైనా ఆయన ఎద్దేవా చేశారు. పట్టణాన్ని అప్‌గ్రేడ్ చేస్తానని చెప్పిన కే. చంద్రశేఖర్ రావు నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవ అభివృద్ధి అవసరమని, కేవలం భారీ ప్రకటనలు కాదు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రచార రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని, నేలమీద అభివృద్ధి కనిపించడం లేదని అరవింద్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# కొండపాక మండలంలో శ్రీ సత్య సాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ ను సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్.









**సిద్దిపేట జిల్లా వెలుతురు మే 18:** తెలంగాణలోని ప్రముఖ సేవా వైద్య సంస్థల్లో ఒకటిగా నిలుస్తున్న హాస్పిటల్ శ్రీ సత్య సాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ పేద పిల్లలకు ఉచిత గుండె వైద్యం అందించడం ఈ ఆసుపత్రి ప్రధాన ప్రత్యేకత కావడంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న పిల్లలతో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్.. జన్మతో వచ్చే గుండె సంబంధిత వ్యాధులు (Congenital Heart Diseases) ఉన్న చిన్నారులకు పూర్తిగా ఉచిత చికిత్స అందిస్తున్న హాస్పిటల్ లో డాక్టర్లతో మాట్లాడి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవలను కొనియాడిన మంత్రి పొన్నం ప్రభాకర్. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... శ్రీ సత్య సాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ చిన్న పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు అందిస్తుండడం వారి సేవకు నిదర్శనం.. వారికి అభినందనలు.. హాస్పిటల్ లో పరీక్షలు, స్కానింగ్, శస్త్రచికిత్సలు, మందులు అన్నీ ఉచితంగా అందిస్తున్నారని..ఆర్థిక స్థితి, కులం, మతం తేడా లేకుండా సేవలు అందిస్తుందని తెలిపిన డాక్టర్లు.. అత్యాధునిక కార్డియాక్ కేర్ సదుపాయాలతో నిర్మించబడిన ప్రత్యేక పిల్లల గుండె ఆసుపత్రి. పరిశోధన (Research) మరియు వైద్య శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.గ్రామీణ ప్రాంతాల పిల్లలకు చేరువగా ఉండేలా తెలంగాణలోని కొండపాకలో ఏర్పాటు చేశారు. మానవ “సేవే మాధవ సేవా అనే లక్ష్యంతో ఈ సంస్థ నడుస్తుంది.. ఈ ప్రాంత ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలి. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి చిన్నారులు చికిత్స కోసం ఇక్కడికి వస్తుంటారు. పిల్లల గుండె వ్యాధుల ముందస్తు గుర్తింపుకు ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సంస్థను శ్రీ సత్య సాయి చైల్డ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నారు. తెలంగాణలో బాలల గుండె వైద్య సేవలకు ఇది ఒక ఆశాకిరణంగా నిలుస్తోంది. మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేసి చిన్న పిల్లలకు ఉండే జబ్బులకు చికిత్స అందించడానికి ప్రభుత్వం ఈ సంస్థ కి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుంది..

# ఎస్ఐహెచ్ఎంకు పూర్వ వైభవం తీసుకువస్తాం: మంత్రి జూపల్లి కృష్ణారావు





**జహీరాబాద్, వెలుతురు మే 18:** జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక’లో భాగంగా ఎస్ఐహెచ్ఎంలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. వీటితో పాటు నిథమ్ (NITHM) విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు, పర్యాటక శాఖ రూపొందించిన **‘టూరిస్ట్ గైడ్’ పోస్టర్‌ను ఆవిష్కరించారు.**

గ్రామీణ యువతకు స్వయం ఉపాధే ధ్యేయం

అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను పునః ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఎస్ఐహెచ్ఎంలో చేరిన పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

గ్లోబల్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన ఈ యుగంలో, ప్రైవేట్ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను అందుకోవడానికి పర్యాటక, ఆతిథ్య (హాస్పిటాలిటీ) రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణను మంత్రి ఆదేశించారు. పిల్లల ఉపాధి కోర్సుల విషయంలో తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలే రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి

- **రైతులకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు తీసుకురావాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
- **రైతులను ఓటు బ్యాంకుగా కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా చూడాలి**
- **బిజెపి నాయకుల వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల స్పందన**



**హైదరాబాద్ వెలుతురు మే 18:** కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై అవలంబిస్తున్న విధానాలు రైతులకు పూర్తి స్థాయి రక్షణను కల్పించడంలో విఫలమవుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ భరోసా, దిగుమతుల నుంచి రక్షణ, ఉత్పత్తి వ్యయాల నియంత్రణ వంటి అంశాల్లో కేంద్రం సమగ్ర దృష్టితో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ కేంద్ర మంత్రులు పదేపదే “కేంద్రమే ధాన్యం సేకరిస్తోంది, అందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరిస్తోంది” అంటూ ప్రచారం చేయడం వాస్తవ పరిస్థితులను వక్రీకరించడం తప్ప మరొకటి కాదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు వస్త్ర శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల సమస్యలను ఒక్క వరి ధాన్యానికి మాత్రమే పరిమితం చేయడం సరైంది కాదని, తెలంగాణలో వరితో పాటు మొక్కజొన్న, జొన్న, కందులు, పెసలు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పత్తి, ఆయిల్‌పామ్ వంటి అనేక పంటలు విస్తృతంగా సాగు అవుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ పంటల కొనుగోలు, మద్దతు ధరలు, దిగుమతిఎగుమతి విధానాలు, ఎరువుల ధరలు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. మంత్రి మాట్లాడుతూ, వరి ధాన్యం విషయంలో కూడా ఎఫ్‌సీఐ పూర్తి పంటను కొనుగోలు చేయడం లేదని, కేంద్రం వరి ధాన్యానికి క్వింటాకు ₹2,300 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం అదనంగా క్వింటాకు ₹500 బోనస్ ఇస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రులు ఎందుకు గుర్తించడంలేదని ప్రశ్నించారు. రైతు ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని చిన్నచూపు చూడడం బాధాకరమన్నారు. రైతులకు నిజమైన భరోసా కల్పిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

కేంద్రం మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న పెసలు, కందులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి పంటలపై 25 శాతం పరిమితి విధించడం వల్ల మిగిలిన పంటను రైతులు ఎక్కడ విక్రయించాలనే ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా తెలంగాణలో విస్తృతంగా సాగు చేస్తున్న మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వం ధర మద్దతు పథకం (PSS) పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదో స్పష్టం చేయాలని కోరారు. ఇది రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని, ఈ రెండు పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ, ఆ ధరకు ప్రభుత్వ కొనుగోలు హామీ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

**మద్దతు ధరల నిర్ణయంలో పారదర్శకత ఎక్కడ?**

కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం C2 + 50 శాతం సూత్రాన్ని అనుసరిస్తున్నాయా అనే విషయాన్ని రైతులకు వెల్లడించాలని మంత్రి డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో ఎరువులు, డీజిల్, విత్తనాలు, కూలీల ఖర్చులు భారీగా పెరిగినా, అదే స్థాయిలో మద్దతు ధరలు పెరగలేదన్నారు. గత ఐదేళ్లలో డీఏపీ ధరలు 70 శాతం, కాంప్లెక్స్ ఎరువులు 60 శాతం, డీజిల్ ధరలు 40 శాతం, వ్యవసాయ కూలీల ఖర్చులు 100 శాతం వరకు పెరిగినా, మద్దతు ధరల పెరుగుదల మాత్రం వరిపై 27 శాతం, గోధుమపై 26 శాతం, మొక్కజొన్నపై 20 శాతం, జొన్నపై 41 శాతం, పత్తిపై 40 శాతం మాత్రమే ఉండటం రైతులకు న్యాయం కాదన్నారు. ఈ పెరుగుదలలు రైతుల అసలు సాగు వ్యయాలకు సరిపోవడం లేదన్నారు.

**దిగుమతి విధానాలతో రైతులకు నష్టం**

కేంద్ర ప్రభుత్వ దిగుమతిఎగుమతి విధానాలు రైతులకు ప్రతికూలంగా మారాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాల కారణంగా దిగుమతి సుంకాలు తగ్గితే అక్కడి నుంచి తక్కువ ధరలకు వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు భారత రైతులపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. ముఖ్యంగా మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలకు దేశీయ మార్కెట్లో గిట్టుబాటు ధరలు రాక తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. గత సీజన్ లో పత్తి విషయంలో ఈ విషయం స్పష్టం అయిందని అన్నారు. అమెరికా నుండి వచ్చే పత్తిపై గత ఏడాది సెప్టెంబర్ డిసెంబర్ మధ్య దిగుమతి సుంకాలపై 11 శాతం తొలగించగా, అక్కడి నుండి పత్తి చౌకగా దేశానికి రావడం వలన, ఇక్కడ ఉత్పత్తి అయిన పత్తి ధర క్వింటాల్ కు 10001500 తగ్గిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయిల్‌పామ్‌పై దిగుమతి సుంకాలు తగ్గించడం వల్ల దేశీయ ఉత్పత్తిదారులకు ధరలు పడిపోతున్నాయని, దీంతో ఆయిల్‌పామ్ రైతులు పెట్టుబడులు కూడా తిరిగి పొందలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఇదే సమయంలో ఎగుమతులకు సరైన ప్రోత్సాహకాలు లేకపోవడం వల్ల భారత రైతులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పరిమితమవుతున్నాయని చెప్పారు.

**ఎరువుల ధరల అసమతుల్యత భూసారానికి ముప్పు**

ఎరువుల ధరల విషయంలో కూడా కేంద్ర విధానం అసమతుల్యతను ప్రోత్సహిస్తోందని మంత్రి విమర్శించారు. యూరియాను మాత్రమే అధిక సబ్సిడీతో తక్కువ ధరకు అందించడంతో రైతులు ఇతర సమతుల ఎరువుల వినియోగాన్ని తగ్గించి యూరియాపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. దీని వల్ల నేల సారం దెబ్బతినడం, భూసార సమతుల్యత కోల్పోవడం వంటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని హెచ్చరించారు.

**విదేశాల్లో రైతులకు రక్షణ – మన దేశంలో నిర్లక్ష్యం**

అమెరికా, యూరప్, జపాన్ వంటి దేశాల్లో రైతులకు నేరుగా ఆదాయ సబ్సిడీలు, ధర పతనంపై ప్రభుత్వ చెల్లింపులు, పంట నష్టపరిహారం, ఎగుమతులకు ప్రోత్సాహకాలు, దిగుమతులపై భారీ సుంకాల ద్వారా రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. కానీ భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం రైతులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని విమర్శించారు. మన దేశ రైతులు ఎరువుల కొరత, పెరిగిన డీజిల్ ధరలు, అధిక కూలీల వ్యయం, ప్రకృతి విపత్తులు, మార్కెట్ అనిశ్చితి వంటి అనేక సవాళ్లతో పోరాడుతున్నారని మంత్రి అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక భరోసా కల్పించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావాలని పేర్కొన్నారు.

కేంద్రానికి మంత్రి తుమ్మల సూచనలు

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చర్యలు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు:

**స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం C2 + 50% ఆధారంగా కనీస మద్దతు ధరలను నిర్ణయించాలి.**

**MSPలకు చట్టబద్ధ హామీ కల్పించాలి.**

**మొక్కజొన్న, జొన్న పంటలను పిఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలి.**

**కేంద్రం కొనుగోలు చేసే పంటల కొనుగోళ్లపై 25 శాతం పరిమితిని తొలగించాలి. కనీసం 75 శాతం పంటలను కేంద్రమే కొనుగోలు చేయాలి.**

**పంటల ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలి.**

**దేశీయ రైతులను రక్షించేందుకు అవసరమైన దిగుమతి సుంకాలు పెంచాలి.**

**ఎరువుల ధరలను రేషనలైజ్ చేయాలి లేదా అన్ని ఎరువులపై సబ్సిడీలు అందించాలి.**

**రైతులకు స్థిరమైన ఆదాయ భరోసా కల్పించే విధానాలు అమలు చేయాలి.**

**రైతులకు నష్టం కలిగించే దిగుమతి విధానాలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలి.**

రైతులకు అనుకూలంగా, వారి ఆదాయ భద్రతను పెంచే ఏ నిర్ణయం తీసుకున్నా తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. “రైతు బాగుంటే దేశం బాగుంటుంది. రైతు సంక్షేమాన్ని రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా, ఆచరణాత్మక విధానాలతో ఆదుకోవాల్సిన సమయం ఇది” అని ఆయన పేర్కొన్నారు.




# ఈ ఏడు రకాల ఆహారాలు తీసుకుంటే ఎముకల పుష్టికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ డిని పుష్కలంగా పొందవచ్చు..

ఎముకలు బలంగా ఉండాలంటే కాల్షియం ఉండాల్సిందే! అనగానే మనందరికీ గుర్తొచ్చేది 'పాలు'. అయితే, లాక్టోస్ అసహనం ఉన్నవారికో లేదా పాలు, పెరుగు వాసన పడని వారికో కాల్షియం ఎలా అందుతుంది..? అనే ఆందోళన అవసరం లేదు. పాలు తాగకపోయినా.. మన వంటగదిలో ఉండే కొన్ని రకాల ఆహార పదార్థాల ద్వారా ఎముకల పుష్టికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, విటమిన్‌డిని పుష్కలంగా పొందవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు.

**1. ఆకు కూరలు..**

పాలకూర, బ్రోకలీ, కేల్ వంటి ఆకుకూరలు కాల్షియం నిధులు. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత పెరుగుతుంది. వయసు మళ్లిన తర్వాత వేధించే 'ఆస్టియోపొరోసిస్' అంటే ఎముకలు గుల్లబారడం ప్రమాదాన్ని ఇవి తగ్గిస్తాయి.

**2. బాదం..**

బాదంలో కాల్షియంతో పాటు మెగ్నీషియం, ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చడమే కాకుండా కండరాల పెరుగుదలకు తోడ్పడతాయి. రోజుకు కొన్ని బాదం పప్పులు నానబెట్టుకుని తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు.

**3. చియా గింజలు..**

చియా గింజలు పరిమాణంలో చిన్నవైనా, పోషకాల్లో మాత్రం అగ్రగామి. వీటిలో కాల్షియం, ఫైబర్,ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి అటు ఎముకల ఆరోగ్యానికి, ఇటు గుండె పటిష్టతకు సహాయపడతాయి.

**4. నువ్వులు..**

మన పూర్వీకులు నువ్వుల లడ్డూలు తినమని చెప్పడంలో అర్థం ఇదే! నువ్వులు కాల్షియం, ఫాస్ఫరస్‌కు ప్రధాన వనరులు. ఇవి దంతాలను, ఎముకలను వజ్రంలా బలోపేతం చేస్తాయి.

**5. సోయా ఉత్పత్తులు..**

పాలకు ప్రత్యామ్నాయంగా సోయా పాలు, సోయా పనీర్ అద్భుతంగా పనిచేస్తాయి. ముఖ్యంగా శాకాహారులకు, పాల ఉత్పత్తులు పడని వారికి ఇది ఒక గొప్ప పోషకాహార మార్గం.

**6. నారింజ..**

నారింజలో కేవలం విటమిన్ సి మాత్రమే కాదు, కాల్షియం కూడా ఉంటుంది. విటమిన్‌సి ఎముకల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తే, కాల్షియం వాటికి దృఢత్వాన్ని ఇస్తుంది.

**7. అంజీర్ పండ్లు..**

ఎండిన అంజీర్ పండ్లలో కాల్షియం, మెగ్నీషియం మెండుగా ఉంటాయి. ఎముక విరిగే ప్రమాదాన్ని తగ్గించడంలోనూ, ఎముకల సాంద్రతను కాపాడటంలోనూ అంజీర్ మేటిగా పనిచేస్తుంది. కాల్షియం శరీరానికి అబ్బాలంటే విటమిన్ డి కూడా అవసరం. అందుకే ఈ ఆహారంతో పాటు రోజూ కాసేపు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవడం కూడా చాలా ముఖ్యం.




# ఒత్తిడి సమయంలో మీ శరీరంలో ఈ మార్పులు గమనించారా..?



ఇప్పుడున్న ఉరుకుల పరుగుల జీవితంలో 'ఒత్తిడి' అనేది సర్వసాధారణం అయిపోయింది. ఆఫీసు పని, కుటుంబ సమస్యలు, ఆర్థిక చింతలు.. ఇలా కారణం ఏదైనా మానసిక ఆందోళన మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయితే, ఒత్తిడి అనేది కేవలం మనసుకే పరిమితం కాదు.. అది శరీరంపై తీవ్రమైన దాడులు చేస్తుంది. కేవలం కొన్ని గంటల పాటు ఉండే ఒత్తిడి కూడా శరీరంలోని రహస్య వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## హార్మోన్ల కల్లోలం.. గుండెకు ముప్పు..!

మనం ఒత్తిడికి గురైనప్పుడు శరీరం 'పోరాటం లేదా పలాయనం' స్థితిలోకి వెళ్తుంది. ఈ సమయంలో శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు విపరీతంగా విడుదలవుతాయి. ఈ హార్మోన్ల ప్రభావంతో రక్తనాళాలు సంకోచించి, గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇది రక్తపోటు అకస్మాత్తుగా పెరగడానికి కారణమవుతుంది.

దీర్ఘకాలికంగా ఒత్తిడి కొనసాగితే, గుండె కండరాలు బలహీనపడి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ హెచ్చరిస్తోంది. ఒత్తిడి మీ శరీరంలోని రక్షణ కవచాన్ని బలహీన పరుస్తుంది. అధిక కార్టిసాల్ స్థాయిలు శరీరంలో వాపును పెంచుతాయి.

వ్యాధులతో పోరాడే తెల్ల రక్త కణాల సామర్థ్యాన్ని ఒత్తిడి తగ్గిస్తుంది. ఫలితంగా జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లు త్వరగా సోకుతాయి. శరీరం ఏదైనా అనారోగ్యం నుంచి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది.

## జీర్ణవ్యవస్థలో అల్లకల్లోలం..

మెదడుకు, జీర్ణవ్యవస్థకు ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. ఒత్తిడికి గురైనప్పుడు మెదడు ఇచ్చే సంకేతాల వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది.

ఎసిడిటీ, గ్యాస్, మలబద్ధకం, కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఒత్తిడిలో ఉన్నప్పుడు కొందరు అతిగా తింటారు, మరికొందరు అసలు తినరు. ఈ రెండు పరిస్థితులు జీవక్రియను దెబ్బతీస్తాయి.

## మెదడుపై ప్రభావం.. జ్ఞాపకశక్తి క్షీణత..!

ఒత్తిడి కేవలం ఆలోచనలనే కాదు, మెదడు నిర్మాణాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మెదడులోని జ్ఞాపకశక్తికి సంబంధించిన భాగాలపై ఒత్తిడి ప్రభావం చూపుతుంది. దీనివల్ల ఏకాగ్రత తగ్గడం, విషయాలను త్వరగా మర్చిపోవడం వంటివి జరుగుతాయి. ఇది కాలక్రమేణా డిప్రెషన్, తీవ్రమైన ఆందోళన (Anxiety)కు దారి తీస్తుంది.


## సంకేతాలను గుర్తించండిలా..

మీ శరీరం ఒత్తిడితో పోరాడుతోందని చెప్పడానికి కొన్ని చిన్న సంకేతాలు ఇవే..

- తరచుగా వచ్చే తలనొప్పి.
- నిద్రలేమి
- పనిపై ఆసక్తి లేకపోవడం, నిరంతర అలసట.
- చిన్నచిన్న విషయాలకే చిరాకు పడటం.

ఒత్తిడిని దూరం చేసుకోవడం అంటే అది కేవలం మనశ్శాంతి కోసం మాత్రమే కాదు, ఆరోగ్యంగా జీవించడం కోసం కూడా. యోగా, ధ్యానం, సరైన నిద్ర, సోషల్ మీడియాకు దూరంగా గడపడం ద్వారా ఒత్తిడిని నియంత్రించవచ్చు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com